

'సిఫారసు'పత్రి

జిల్లా కేంద్రమైన రాయచోటిలో పేరుకే వంద పడకల ఆస్పత్రి ఉంది. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో అందుతున్న వైద్యం కూడా ఇక్కడ అందడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఏ చిన్న ప్రమాదం జరిగి ఇక్కడికి వచ్చిన వెంటనే తిరుపతి, కడప ఆస్పత్రులకు రెఫర్ చేయడం ఇక్కడి సిబ్బందికి మామూలై పోయింది. వంద పడకల ఆస్పత్రి అని గర్వంగా చెప్పుకోవడం తప్పితే ఇక్కడ అందుకు తగ్గట్టుగా వైద్యులు లేరు.. పరికరాలు అంతకన్నా లేవు. ఉన్న పరికరాలను వాడే పరిజ్ఞానం లేక అవి మూలనపడ్డాయి. ఇప్పటికైనా వంద పడకల ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

- ప్రతి విషయానికి తిరుపతి, కడప ఆసుపత్రులకు రెఫర్
- పరికరాలను ఉపయోగించే పరిజ్ఞానం లేని డాక్టర్లు
- హడావిడి తప్ప ఆచరణ కరువు
- ఇదీ రాయచోటి వంద పడకల ఆసుపత్రి దుస్థితి



వంద పడకల ఆసుపత్రి ముఖద్వారం

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 2: రాయచోటి వంద పడకల ఆసుపత్రి ప్రారంభమై దాదాపు నాలుగు నెలలు పూర్తి కావస్తోంది. ఏ చిన్న ప్రమాదం జరిగినా ఇక్కడ ఉన్న సిబ్బంది వెంటనే బాధితులను తిరుపతి, కడపకు రెఫర్ చేస్తుండటంతో ఈ ఆస్పత్రి కేవలం 'సిఫారసు'పత్రి గానే మిగిలిపోయింది. రాయచోటి పరిసరాల్లో ఏ ప్రమాదం జరిగినా వెంటనే ఇక్కడికి వస్తారు. కానీ ఆసుపత్రి సిబ్బంది వారిని మెరుగైన వైద్యం పేరుతో తిరుపతి, కడప ప్రభుత్వాసుపత్రులకు రెఫర్ చేయడం పరిపాటిగా మారింది. వంద పడకల ఆసుపత్రితో మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చిందనుకున్న రాయచోటి వాసుల ఆశలు అడియాశలయ్యాయి. అయితే ఎమర్జెన్సీ క్యాజువాలిటీ దగ్గర మాత్రం నర్సుల హడావుడి, హంగామా తప్ప పెద్ద డాక్టర్లు కనిపించరు. ఇదీ రాయచోటి వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో ప్రతిరోజూ కనిపించే దృశ్యాలు. ఆసుపత్రికి పరికరాలు అయితే కొద్దో, గొప్పో మంజూరయ్యాయి. కానీ వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో తెలియక అవి ఓ మూలకే పరిమితమయ్యాయి. అంతేగాక ఇంకా కొన్ని డిపార్టుమెంట్లకు డాక్టర్లు, సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాక వైద్యం మృగ్యం అయిందనే ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి.

పూర్తిగా అందుబాటులోకి రాని పరికరాలు..

ముఖ్యంగా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అయి ఉండాలి, పీడీయాట్రిషన్, గైనకాలజిస్ట్, అనస్థీషియా, జనరల్ మెడిసిన్ డాక్టర్‌తో పాటు 6 మంది ఎంబీబీఎస్ డాక్టర్లు అదనంగా ఉండాలి. అయితే కేవలం ముగ్గురు, నలుగురు డాక్టర్లు మాత్రమే కనిపిస్తున్నారు. ల్యాబ్ ఫెసిలిటీ అందుబాటులోకి తీసుకురాలేదు. బ్లడ్ బ్యాంక్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. కానీ దానిని ఉపయోగించే విధానం తెలియక ఒక మూలన పడేసి ఉన్నారు. ఆపరేషన్ థియేటర్లు కనీసం తలుపులు కూడా తెరుచుకోవడం లేదు. ఈ గదుల్లో అన్ని రకాల టెక్నాలజీలతో కలిగిన పరికరాలు అందుబాటులో ఉండాలి. ఆప్తమాలజీ ఇఎన్టీకి ప్రత్యేకంగా డాక్టర్లు అందుబాటులో లేరని తెలిసింది. అందుబాటులో మైక్రోస్కోప్ ఖచ్చితంగా ఉండాలి. వారితో పాటు ఇద్దరు అసిస్టెంట్స్ కూడా ఉండాలి. ప్రత్యేకంగా లేబర్ వార్డ్ ఉంది కానీ అందులో సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్నాయి. కంటి ఆపరేషన్‌కు ప్రత్యేకమైన ఆపరేషన్ థియేటర్ ఉంది కానీ తలుపులు తెరుచుకోలేదు. ఫ్యామిలీ ప్లానింగ్ యూనిట్ అనే ప్రత్యేకమైన గది ఒకటి ఉండాలి. ఐదుమంది ఫార్మసిస్టులు ఉన్నారు. కానీ ల్యాబ్ టెక్నీషియన్‌కు సంబంధించిన పరిజ్ఞానం వారికి తెలియడం లేదు. అల్ట్రా సౌండ్ గది మాత్రమే ఉంచారు. అందులో ఏ పరికరాలు లేవు. రేడియాలజిస్ట్ కూడా అందుబాటులోకి రాలేదు. ఎక్స్‌రే యూనిట్ అధునాతనమైనది ఉంది కానీ దానిని ఇంకా ఉపయోగానికి తీసుకురాలేదు. సిబ్బంది కూడా అంతంత మాత్రమే ఉన్నారు.

ఇప్పుడిప్పుడే కొత్త పరికరాలు వచ్చాయి..

కొత్తగా ఏర్పాటైన వంద పడకల ఆసుపత్రికి ఇప్పుడిప్పుడే కొత్తగా పరికరాలు వచ్చాయి. సెంట్రల్ గవర్నమెంట్ స్కీమ్స్ ద్వారా కొన్ని పరికరాలు ఇక్కడికి వచ్చాయి. వాటిని ఉపయోగించుకోవడానికి అక్కడ నుంచే కొంతమంది నిపుణులు వచ్చి ఇక్కడ ఆ ల్యాబ్ టెక్నీషియన్లకు ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉంది. అంతేగాకుండా ఆప్తమాలజీకి సంబంధించి రూ.20 లక్షలతో ఒక కొత్త మిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. కొద్ది రోజుల్లో అన్ని రకాల డిపార్టుమెంట్లు పని చేసే విధంగా అన్ని పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

- డేవిడ్ సుకుమార్, డీసీహెచ్

పరికరాలను ఉపయోగించుకోవాలి..



జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి కట్టారు. కానీ పరికరాలను, సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురాకపోతే ఉపయోగం లేదు. ఈ ఆసుపత్రిలో పరికరాలను ఉపయోగించడం చేతకాకపోతే తగినంత సిబ్బంది ఉన్నా ఉపయోగం లేదు. ఇక్కడ అన్ని రకాల వసతులు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రాయచోటి జిల్లా కేంద్రంలో దాదాపు 20 మండలాల ప్రజలు ఈ ప్రాంతంపై ఆధారపడి జీవిస్తున్నారు. రోగులకు నిత్యం అందుబాటులో ఉండి పరికరాలను ఉపయోగించి వారికి తగినంత మెరుగైన సేవలు అందించాల్సిన ఆవశ్యకత అధికారులపై ఉంటుంది. ప్రారంభించి నాలుగు నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు పరికరాలు అందుబాటులోకి తీసుకురాలేకపోతున్నారని అంటే అధికారుల వైఫల్యం అని మేము భావిస్తున్నాం. ఇంకా కొన్ని డిపార్టుమెంట్లలో తలుపులు తెరుచుకోలేదు.

- ఎ.రామాంజులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

సరిగ్గా చూడడం లేదు..



మాది లక్కిరెడ్డిపల్లె మండలం. మాకు గ్యాస్ట్రబుల్ ఎక్కువైపోయి ఇక్కడికి వచ్చి చేరాను. మూడు రోజులుగా వైద్యం అందించినా నాకు ఆరోగ్యం కుదుట పడలేదు. నేను ఇంకొకరి దగ్గరికి వెళ్లి చూపించుకోవాలని అనుకుంటున్నాను. సూదులు, మాత్రలు ఇస్తున్నారు. కానీ అవి పూర్తిగా పనిచేయడం లేదని అనుకుంటున్నాను. తాత్కాలికంగా పని చేస్తున్నాయే తప్ప జబ్బు పూర్తిగా నయం కావడం లేదు.

- లక్ష్మిదేవమ్మ, లక్కిరెడ్డిపల్లె మండలం



చికిత్స కోసం వచ్చిన చిన్నారిని నేలపై పడుకోబెట్టిన దృశ్యం



చికిత్స కోసం వచ్చి బెడ్లు ఖాళీ లేకపోవడంతో బల్లపై పడుకున్న వృద్ధురాలు



ల్యాబ్‌లో ఉపయోగించని పరికరాలు



వంద పడకల ఆసుపత్రిలో పాత బెడ్స్ మీద పడుకున్న రోగి

కౌంటింగ్ సిబ్బందికి నియోజకవర్గాల కేటాయింపు

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 2: జిల్లాలో ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం 918 మంది కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలను కేటాయించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ అబ్జర్వర్లకు వివరించారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి ఎన్నికల కమిషన్ ద్వారా జిల్లాకు కేటాయించబడిన అబ్జర్వర్లు బిపిన్‌కుమార్‌రాయ్, చరణ్‌జీలాల్, ఏకే ప్రజాపతిల సమక్షంలో కౌంటింగ్ సిబ్బందికి నియోజకవర్గాలను కేటాయించే రెండోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ప్రకారం రెండు విడతల్లో ర్యాండమైజేషన్ ద్వారా 120 శాతం రిజర్వుతో కలిపి మొత్తం 918 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు నియోజకవర్గాలకు కేటాయించామని నియామక ఉత్తర్వులను సంబంధిత రిటర్నింగ్ అధికారులు, సిబ్బందికి అందిస్తామని తెలిపారు. 4వ తేదీ ఉదయం 5 గంటలకు 3వ విడత ర్యాండమైజేషన్ నిర్వహించి ఏ టేబుల్‌లో కౌంటింగ్ నిర్వహించాలో తెలియచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణరావు, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో పాటు సీపీవో కృష్ణానాయక్, ఏడీ వెంకట్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నరసింహారావు, సంబంధిత నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సమస్యలా...?

- విధుల్లో ఉంటూ గన్‌తో కాల్చుకుని..
- మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



వేదవతి (ఫైల్)

రాయచోటి టౌన్, జూన్ 2: కుటుంబ సమస్యలా... మరేదైనా కారణమో తెలియదు కానీ రాయచోటి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సెంట్రీ డ్యూటీలో ఉన్న కబ్బాలి వేదవతి (28) ఆదివారం సాయంత్రం గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం బింగానిపల్లె చెందిన వేదవతి 2016లో పుంగనూరులోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షల కోసం శిక్షణ తీసుకుంటుండగా అక్కడే ఫ్యాకల్టీగా పనిచేస్తున్న మదనపల్లెకు చెందిన దస్తగిరితో ప్రేమలో పడి 2016లో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ క్రమంలో 2017లో వేదవతికి కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. దీంతో వేదవతి చిత్తూరులో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ సంవత్సరం క్రితం బదిలీపై అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చింది. ప్రస్తుతం దస్తగిరితో కలిసి వేదవతి రాయచోటి పట్టణంలోని రాజీవ్ స్వగృహ పక్కన గల ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటోంది. ఇదిలా ఉండగా వేదవతి భర్త దస్తగిరికి గతంలోనే వివాహం జరిగి ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. మొదటి భార్య దస్తగిరిని వదిలి వెళ్లిపోవడంతో అతడి ఇద్దరు కుమారులు ప్రస్తుతం మదనపల్లెలోని నానమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. ప్రస్తుతం వేదవతికి 5 సంవత్సరాల కుమార్తె కలదు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సెంట్రీ డ్యూటీలో ఉన్న వేదవతి గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే సెంట్రీ డ్యూటీకి వెళ్లేందుకు 5 గంటలకు మరో కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి చూడగా వేదవతి రక్తపుమడుగులో కుర్చీలో పడి ఉండడం చూసి పోలీసు అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు డీఎస్పీ రామచంద్రరావు, అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం వేదవతి మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలియజేశారు. ఇదిలా ఉండగా వేదవతి సెంట్రీ డ్యూటీలో ఉన్న సమయంలో ఎవరితోనూ ఫోన్లో మాట్లాడిన అనంతరం ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. తన భార్యతో నాలుగు గంటలకు ఫోన్లో మాట్లాడగా బిర్యానీ తీసుకురమ్మని చెప్పిందని, చికెన్ తీసుకునేందుకు వెళ్లగా వెంటనే తనకు ఫోన్ వచ్చిందని, మీ భార్య గన్‌తో కాల్చుకుని చనిపోయినట్లు చెప్పారని భర్త దస్తగిరి అంటున్నాడు. ఇదిలా ఉండగా వేదవతి మీకు రెండో భార్య అంట కదా ముందు భార్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారని దస్తగిరినే అడగగా అలాంటిదేమీ లేదని మొదటి పెళ్లి విషయంపై దాటవేసే ప్రయత్నంగా మాట్లాడాడు. కుటుంబ సమస్యల కారణంగానే వేదవతి ఆత్మహత్య చేసుకుందా.. లేదా అనే విషయం విచారణలో తేలాల్సి ఉంది.

'కౌన్'టింగ్!



- కౌన్ బనేగా ప్రజాపతి?
- ఎగ్జిట్‌పోల్ ఫలితాలతో లోపల గుబులు
- మెజార్టీలపైనే ప్రధానంగా దృష్టి
- సరాసరిన గంటకు మూడురౌండ్లు లెక్కింపు

కలికిరి, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు గురించి రాజకీయ వర్గాలతో పాటు సామాన్య ప్రజల్లో కూడా ఉత్కంఠ నెలకొంది. శనివారం సాయంత్రం వచ్చిన ఎగ్జిట్‌పోల్ ఫలితాల వెల్లడితో పరిస్థితి అర్థమవుతున్నా ఇంకా అభ్యర్థులను లోలోపల గుబులు పట్టి పీడిస్తోంది. మరీ ధీమాగా ఉన్న వారు మెజారిటీలపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఓట్ల లెక్కింపు ప్రారంభంలో పోస్టల్ బ్యాలెట్‌ల అనంతరం ఈవీఎంల లెక్కింపులో గంటకు మూడురౌండ్ల వంతున లెక్కింపు పూర్తవుతుందని చెబుతున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు మంగళవారం నాటి లెక్కింపు కోసం ఏర్పాట్లు చేసుకోవడంలో తలమునకలుగా ఉన్నారు. ఏజెంట్ల నియామకాలు పూర్తి చేసుకున్నా, వారందరినీ తగు జాగ్రత్తలు తీసుకొనే విషయంలో అప్రమత్తం చేస్తున్నారు. రాజకీయ శిబిరాలన్నీ ఏజెంట్ల సమావేశాలతో బిజీగా ఉన్నాయి. మరోవైపు పోలీసులు కౌంటింగ్ కేంద్రాలున్న జిల్లా కేంద్రాలకు రావద్దంటూ హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లోనే స్థానికంగా ఉండేందుకు పార్టీల కార్యకర్తలు సర్దుకుంటున్నారు. ప్రతి లెక్కింపు కేంద్రాన్ని మూడంచెల పద్మవ్యూహంతో కట్టడి చేస్తున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు.

పోలింగ్ కేంద్రాల వారీగానే ఓట్ల లెక్కింపు

అన్ని నియోజకవర్గాల్లోనూ పోలింగ్ కేంద్రాల వారీగానే ఓట్ల లెక్కింపు జరగనుంది. దీంతో ఏయే బూత్‌లలో ఎవరెవరికి ఎన్ని ఓట్లు పడిందీ స్పష్టంగా తెలిసిపోతుంది. గతంలో జరిగిన రెండు ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లన్నీ కలబోసి లెక్కకట్టడంతో ఏ గ్రామంలో ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయో తెలిసేది కాదు. పీలేరు నియోజకవర్గంలోని ఒక పోలింగ్ కేంద్రంలో మొత్తం వంద శాతం మైనారిటీ ముస్లిం ఓట్లు కావడం విశేషం. ఇక్కడ వెల్లడయ్యే ఫలితం కూడా ముస్లింల సమస్యలు, ఆకాంక్షలకు అనుగుణంగా వారి మనోగతానికి అద్దంలా ఉంటుంది. ఇలా మరికొన్ని కేంద్రాల్లో దళితులు లేదా ఇతర మూకుమ్మడి వర్గాలు, కులాలు, వృత్తులకు చెందిన ఓటర్లు అత్యధికంగా ఉంటే అక్కడ వెల్లడయ్యే ఫలితం కూడా వివిధ అంశాలను ప్రభావితం చేసే విధంగా ఉంటుందని తెలుస్తోంది.

క్రాస్ ఓటింగ్ కూడా ఆసక్తిదాయకమే

ప్రస్తుతం పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరుగుతున్నందున క్రాస్ ఓటింగ్ అంశం కూడా ఈసారి లెక్కింపులో ఆసక్తిదాయకంగా ఉంటుంది. ఒకే ఓటరు అసెంబ్లీ, పార్లమెంటుకు పార్టీల పరంగా అభ్యర్థులకు వేర్వేరుగా ఓటేయ్యడాన్నే క్రాస్ ఓటింగ్ అంటారు. ఒక పోలింగ్ కేంద్రంలో అసెంబ్లీ అభ్యర్థికీ, ఎంపీ అభ్యర్థికీ ఒకే సంఖ్యలో ఓట్లు రావడమేది చాలా అరుదుగా మాత్రమే జరుగుతుంది. ఏదో నాలుగైదు ఓట్లు తేడాగా ఉంటే పట్టించుకోరుగానీ, అలా కాకుండా ఒక పార్టీకి చెందిన ఎమ్మెల్యేకి వచ్చిన ఓట్లకన్నా చాలా అధికంగానో లేక చాలా తక్కువగానో వస్తే ఆ పోలింగ్ కేంద్రంలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగిందని అంచనాకొస్తారు.



రాజంపేటపై విరుచుకుపడ్డ పెనుగాలులు

- పెనుగాలులతో రూ.20 కోట్లకు పైబడి నష్టం
- 400 ఎకరాల్లో నేలకొరిగిన అరటి, బొప్పాయి, నిమ్మ పంటలు
- కుప్పకూలిపోయిన చెట్లు, కరెంటు స్తంభాలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు
- 24 గంటలుగా కరెంటు బంద్



రాజంపేట మండలం బ్రాహ్మణపల్లెలో నేలకొరిగిన అరటిపంట

రాజంపేట, జూన్ 2: శనివారం సాయంత్రం వీచిన భారీ పెనుగాలులకు రూ.20 కోట్లకు పైబడి నష్టం వాటిల్లింది. పట్టణంలో పెద్ద ఎత్తున పెనుగాలులు రావడంతో పట్టణంలోని అనేక చోట్ల భారీ చెట్లు నేలకొరిగాయి. ఎక్కడి విద్యుత్ స్తంభాలు అక్కడే కుప్పకూలిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయ్యాయి. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకు పట్టణంలోని సుమారు 70 శాతం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా కాలేదు. కరెంటు లేకపోవడంతో ప్రజలు రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పట్టణంలో నీళ్ల లేక తాగు నీటికి కూడా ఇబ్బందులు పడ్డారు. రాజంపేట విద్యుత్ శాఖ డీఈ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నుంచి రాత్రంతా సిబ్బందితో కలిసి విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. 30 శాతం ప్రజలకు శనివారం రాత్రి విద్యుత్‌ను పునరుద్ధరించగా 70 శాతం మందికి విద్యుత్‌ను పునరుద్ధరించలేకపోయారు. ఆదివారం సాయంత్రం వరకు పట్టణంలోని అనేకచోట్ల పట్టణ వాసులు కష్టాలు పడ్డారు. ప్రధానంగా రాజంపేట ఆర్ఎస్ రోడ్డు, ఎర్రబల్లె, ఉస్మాన్‌నగర్, నూనెవారిపల్లె, మెయిన్‌రోడ్డు, చుట్టుపక్కల ప్రాంతాల్లో కరెంటు పోల్సన్నీ నేలకొరగడం, విద్యుత్‌వైర్లు తెగిపోవడం, ఎక్కడ పడితే అక్కడ చెట్లు నేలకొరగడం వల్ల విద్యుత్ పునరుద్ధరణ చేపట్టలేకపోయారు. ఈ విషయం విద్యుత్ శాఖ డీఈ రాజశేఖర్‌రెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా భారీ పెనుగాలుల వల్ల పట్టణంలో స్తంభాలన్నీ పడిపోయాయని, చెట్లు తీగలపై పడటంతో తీగలన్నీ పాడయ్యాయని, యుద్ధప్రాతిపదికన యంత్రాలను తెప్పించి లైన్లు లాగి పనులు చేస్తున్నామన్నారు. దీనివల్ల కొన్నిచోట్ల కరెంటు ఆదివారం సాయంతం వరకు పునరుద్ధరించ లేకపోయాయమని, ఆదివారం రాత్రికి కరెంటును అన్నిచోట్ల పునరుద్ధరించామని తెలిపారు.

400 ఎకరాల్లో అరటి, బొప్పాయి, నిమ్మ పంటలు ధ్వంసం

శనివారం సాయంత్రం ఒక్కసారిగా పెనుగాలులతో కూడిన వర్షం పడటంతో 400 ఎకరాల్లో అరటి, బొప్పాయి, నిమ్మ పంటలు దెబ్బతిన్నాయి. హస్తవరం, పోలి, మందరం, మందపల్లె, ఆకేపాడు, బ్రాహ్మణపల్లె పెద్దకారంపల్లె, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ పంటలు దెబ్బతిన్నాయి. ఆరుగాలం కష్టించి ఎకరాకు సుమారు రూ.50 వేలు పైబడి ఖర్చు చేసి సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. ఎకరా అరటి సాగు చేయాలంటే పెద్దఎత్తున కష్టపడటంతో పాటు 50 వేలకు పైబడి ఖర్చు చేయాలి. అరటి పంటలోనే ఏకంగా ఎకరాకు 25 వేలకు పైబడి నష్టం వాటిల్లింది. అదే పంట పండి చేతికందివుంటే ఎకరాకు 1.50 లక్షలు ఆదాయం వచ్చేది. ఆదాయం అటుంచి సాగు ఖర్చులకు పెట్టిన పెట్టుబడి కూడా లేకుండా పోయింది. వడ్డీలకు తెచ్చి పెట్టుబడి కూడా రాకపోవడంతోరైతులు అప్పుల పాలయ్యారు. అదేవిధంగా అక్కడక్కడా 50 ఎకరాల్లో బొప్పాయి, 20 ఎకరాల్లో నిమ్మ పంట నేలకొరిగింది. పంటనష్టాలను అంచనా వేయడానికి మండల ఉద్యానవన శాఖాధికారి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఉద్యానవన వ్యవసాయ సిబ్బందితో కలిసి పంట నష్టాలను అంచనా వేయడంలో నిమగ్నమయ్యారు. ఉద్యానవనశాఖాధికారి సురేష్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రైతు భరోసా కేంద్రాల పరిధిలోని వ్యవసాయ శాఖ సిబ్బంది సంయుక్తంగా ఆదివారం క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి పంట నష్టాలను పరిశీలిస్తున్నామన్నారు. ఆదివారం సాయంత్రం ప్రాథమికంగా క్షేత్రస్థాయి ఉద్యానవన సిబ్బంది ఇచ్చిన సమాచారం ప్రకారం 210 ఎకరాల్లో అరటి, 15 ఎకరాల్లో బొప్పాయి 7, ఎకరాల్లో నిమ్మ పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం అందినట్లు తెలిపారు. రెండు రోజుల్లో నివేదికలను తయారు చేసి నష్ట పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు.



ఆకేపాడులో నేలకొరిగిన అరటితోట



బ్రాహ్మణపల్లె వద్ద పడిపోయిన నిమ్మ తోటను పరిశీలిస్తున్న అధికారి



రాజంపేటలో నేలకొరిగిన కరెంటు స్తంభాలు



రోడ్డుపై పడ్డ విద్యుత్ స్తంభాలు


అరకొరగా దిగుబడి వచ్చిన మామిడి పంట

చేదెక్కిన 'మామిడి'



- గణనీయంగా తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో అరకొర అమ్మకాలు
- నష్టాల బాటలో మామిడి రైతులు
- కొండెక్కిన ధరలు, ఆందోళనలో కొనుగోలు దారులు

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు



మామిడి కోత పూర్తయిన వెంటనే రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలను చేపడితే మామిడి సాగులో అధిక దిగుబడులను సాధించవచ్చు. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది మామిడి పూత ఆలస్యంగా రావడమే కాక పూత శాతం కూడా తగ్గింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం జూన్‌లో మామిడి చెట్ల కత్తిరింపులు, తోటల్లో దున్నకాలు, చెట్లకు పాదులు తీయడం వంటివి చేసుకోవాలి. సేంద్రియ ఎరువులను వినియోగించడమే కాకుండా నీటి తడులను కూడా సకాలంలో అందిస్తే పూత రాలిపోకుం డా తెగుళ్లు ఆశించకుండా మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మామిడి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీ సౌకర్యాలను కూడా రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-పి.రవిచంద్ర, అన్నమయ్య జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

రాయచోటిటౌన్, జూన్ 2: పండ్లలో రారాజుగా పేరొందిన మామిడి పండు చేదెక్కింది. అరకొర వర్షాలు, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆలస్యంగా పూత రావడం, అంతలోనే తెగుళ్లు సోకడం రైతులను కలవరపాటుకు గురిచేసింది. వేసిన మందులు నాసిరకం కావడం, ఎండల తీవ్రతకు పిందె రాలిపోవడంతో దిగుబడి శాతం గణనీయంగా తగ్గింది. ఫలితంగా మామిడి రైతుకు ఈ ఏడాది కన్నీళ్లే మిగులుతున్నాయి. పంట దిగుబడి సరిగాలేక పోవడంతో మామిడి పండు మార్కెట్ చేరకపోయింది. తక్కువ మొత్తం పండ్లు అందుబాటులోకి రావడంతో ధరలు ఆకాశాన్ని చేరుకోవడం తో మామిడి ప్రియులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకెళితే....

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఎక్కువ శాతం మంది రైతులు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. రైతన్నలు మామిడి సాగులో ఎదురయ్యే కష్టనష్టాలకు ఓర్చుకుని ఏళ్ల తరబడి తోటలను సాగు చేస్తున్నా మామిడి పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రావడం లేదు. వాతావరణంలో మార్పులు, అకాల వర్షాలు, వర్షా భావ పరిస్థితులు మామిడిపై పడడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో కొన్ని చోట్ల ఎండ వేడిమికి కాయలు రాలిపోగా మరికొన్ని చోట్ల మామిడి చెట్లకు రోగం వచ్చి కాయలు రాలిపోయాయి. పండ్లలో రారాజుగా పిలవబడే మామిడి కాయలు ఇటు తోటల్లో గానీ, అటు మార్కెట్‌లో గానీ పూర్తి స్థాయిలో కనిపించడం లేదు. మార్కెట్‌లో అరకొరగా దర్శనమిస్తున్న మామిడి కాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఫలితంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు మామిడి కాయలను కొనుగోలు చేయాలంటేనే జంకుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి కిలో ధర రూ.80 నుంచి రూ.180లు పలుకుతుండడంతో ఈ ఏడాది మామి డి దిగుబడి గణనీయంగా తగ్గడంతోనే ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు అంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 35,867 హెక్టార్లలో సాగు

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 35,867 హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఎంతో ఆశగా మామిడి పండ్లు సాగు చేస్తున్న రైతన్నలకు గిట్టుబాటు ధరలు లేక, ఆశించిన స్థాయిలో దిగుబడు లు రాక నాలుగేళ్లగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి రైతులకు గతేడాది కంటే ఈ ఏడాది వాతావరణ పరిస్థితులను అనుకూలించకపోవడంతో నష్టాలు తప్పడం లేదని అటు రైతులు ఇటు వ్యాపారులు వివరిస్తున్నారు. అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, మదనపల్లె, పీలేరు తదితర ప్రాంతాల రైతులు, వ్యాపారులు కూడా మామిడి పంటను ముంబై, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమ తి చేస్తారు. గతంలో మామిడి తోటల్లో పూతను చూసి వ్యాపారులు పంటను కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం నేరుగా తోటల వద్దకు వెళ్లి కాయల దిగుబడులను చూసి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వ్యాపారులు మామిడి కొనుగోళ్లపై ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది అనుకున్నంత స్థాయి లో పంట దిగుబడి రాక రైతులు ఆందోళన చెందుతున్నారు.

మార్కెట్‌లో అరకొరగా పండ్లు...

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఈఏడాది మామిడి పంట దిగుబడి గణనీయంగా తగ్గడంతో మార్కెట్‌లో మామిడి ధరలు ఎండలతో పోటీపడుతున్నా యి. సాధారణంగా ఏటా మార్చి చివరి వారం మే చివరి వరకు మార్కెట్‌లో ఎక్కడ చూసినా మామి డి పండ్లు దర్శనమిచ్చేవి. ఈ ఏడాది మామిడి దిగుబడి గణనీయంగా తగ్గడంతో మార్కెట్‌లో మా మిడి పండ్లు అరకొరగా దర్శనమిస్తున్నాయి. ఆశించిన స్థాయిలో పూత రాకపోవడం, అక్కడక్కడా అరకొరగా పూత వచ్చినా అది కూడా అకాల వర్షాలకు, తీవ్ర వర్షాభావ పరిస్థితులకు రాలిపోవడంతో మామిడి దిగుబడిపై ప్రభావం పడింది. శీతాకాలం లో మామిడిచెట్లకు దట్టంగా పూత వచ్చినా వాతావరణంలో మార్పుల కారణంగా నిలబడక పోవ డం, నాసిరకం మందుల ప్రభావంతో పూత నిలబడలేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో అరకొర మామిడిపండ్లు కనిపించినా కిలో రూ.80 నుంచి రూ.180 వరకు పలుకుతున్నాయి. దీంతో సామాన్యులు మామిడి పండ్లు కొని తినే పరిస్థితులు లేకుండా పోయాయి.

సాగుకు అధిక ఖర్చులు వస్తున్నాయి



మామిడి సాగుకు పెద్ద మొత్తంలో ఖర్చులు వస్తున్నాయి. మామిడి తోటలు దుక్కి దున్నకం, పాదులు తీయడం, కంచె వేయడం, చెట్లకు ఎరువులు, మందులు, నీరు కట్టడం వంటివి చాలా అవసరం. ఇంత కష్టపడినా నాలుగేళ్లగా పంట సరిగ్గా రావడం లేదు. పెరిగిన ధరలతో మామిడి సాగులో పెట్టుబడి ఎక్కువవుతున్నా ఆశించిన స్థాయిలో ఆదాయం రావడం లేదు. ప్రభుత్వాలు పరిహారం అందించి ఆదుకోవాలి.

- శ్రీనివాసులరెడ్డి, రైతు, మాధవరం నాగిరెడ్డిగారిపల్లె

మామిడి రైతులను ఆదుకోవాలి



జిల్లాలో మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్న రైతులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. రైతులకు కూలీలు ఖర్చులు అధికమవుతున్నాయి. మామిడి పంట కూడా దిగుబడి కూడా రోజు రోజుకూ తగ్గుతోంది. మామిడి చెట్లు ఉన్న ప్రతి రైతుకూ ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. రైల్వేకోడూరు, రాయచోటి ప్రాం తాల్లో మామిడి ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి రైతన్నలకు ప్రభుత్వం అండగా నిలవాలి.

- సిద్ధిగాళ్ల శ్రీనివాసులు, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి

వెలవెలబోతున్న మామిడి మండీలు

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రైల్వేకోడూరు 3,687, టి.సుండుపల్లె 3,036, చిన్నమండెం 2,500, లక్కిరెడ్డిపల్లె 2,400, వీరబల్లి 2,105, కేవీపల్లె 1,850, చిట్వేల్ 1,760, గుర్రంకొండ 1,658, రామాపురం 1,433, పీలేరు 1,400, కలకడ 1,378, పెనగలూరు 1,352, సంబేపల్లె 1,230, వాయల్పాడు 1,150, కలికి రి 1,090, గాలివీడు 9,020, రాయచోటి 890, నిమ్మనపల్లె 820, పెద్దమండ్యెం 784, నందలూరు 712, ఓబులవారిపల్లె 650, రామసముద్రం 600, మదనపల్లె 690, రాజంపేట 374, కురబలకోట 300, తంబళ్లపల్లె 300, బి. కొత్తకోట 286, మొలకలచెరువు 250, పీటీఎం 217, పుల్లంపేట 196 హెక్టార్లలో మామిడి పంటను రైతులు సాగు చేశారు. ఈఏడా ది దిగుబడి గణనీయంగా తగ్గడంతో వాటి విక్రయం కోసం ఏర్పాటు చేసిన మండీలు వెలవెలబోతున్నాయి. జిల్లాలో మామిడి కాయలను విక్రయించేందుకు వ్యాపారులు పలు మండీలను ఏర్పాటు చేశారు. రైతులు, వ్యాపారులు మామిడి కాయలను ఈ మండీలకు చేర్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం మామిడి దిగుబడి గణనీయంగా తగ్గడంతో మండీ లకు మామిడి కాయలు రాకపోవడంతో మామిడి మండీలు వెలవెలబోతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో కొందరు వ్యాపారులు రైతులకు అనుకూలంగా ఆయా మండల కేంద్రాల్లోనే మామిడి షెడ్లను ఏర్పాటు చేస్తుంటారు. ఆయా మండలాల్లోని రైతులు అక్కడికే కాయలను తరలించి విక్రయిస్తుంటా రు. ప్రస్తుతం కాయలు పూర్తి స్థాయిలో రాకపోవడంతో ఆ షెడ్లు కూడా ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

వీరబల్లి బేనీషాకు దేశ, విదేశాల్లో భలే గిరాకీ...!

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి సమీపంలోని వీరబల్లి మండలంలో మామిడి తోటల్లో అత్యధికంగా లభించే వీరబల్లి బేనీషా అంటే మహాఇష్టం. ఈ వీరబల్లి బేనీషా చాలా రుచిగా ఉంటుం ది. ఈ బేనీషాను కొనుగోలు చేయడానికి ఢిల్లీ, ముంబై, కలకత్తా ప్రాంత వ్యాపారులు వస్తుంటా రు. ఈ వీరబల్లి బేనీషాను మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. అందుకే ఈ బేనీషాకు అంత పేరు వచ్చిందని రైతులు, వ్యాపారు లు చెబుతుంటారు. వీరబల్లి మండలంలో మామి డి తోటలు అధికంగా ఉన్నాయి. అందుకోసమే మామిడి ప్రియులు ఎక్కువగా ఈ వీరబల్లి బేనీషాను ఇష్టపడుతుంటారు.


మండీలకు చేరిన మామిడి కాయలు

వైభవంగా జాంబవంతుని తిరుణాల

- కలశాలతో ఊరేగింపు
- వెండి కవచంతో స్వామి దర్శనం

రైల్వేకోడూరు, జూన్ 2: పట్టణంలోని అంకమ్మనగర్‌లో వెలసి ఉన్న జాంబవంతస్వామి తిరుణాల ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయాన్నే ఆలయం నుంచి భక్తులు 108 కలశాలతో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కలశాలలో ఉన్న నీటితో స్వామికి అభిషేకం చేశారు. స్వామి వారికి మొదట పంచామృతాభిషేకం చేశారు. వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం పోతురాజు అమరేంద్ర కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.


వెండికవచంతో దర్శనమిస్తున్న స్వామి


కలశాలతో పురవీధుల్లో ఊరేగింపు

పశువులను రైతులే మేపాలి

- వదిలేయడంతో ప్రమాదాల్లో పశువులు మృతి
- లక్షలాది రూపాయలు నష్టపోతున్న రైతులు
- ఇన్సూరెన్స్ చేస్తేనే బీమా : అధికారులు

బి.కోడూరు, జూన్ 2: పశువులను రైతులే స్వయంగా మేపాల్సి ఉంటుంది. లేనిపక్షంలో పశువులు పలు రకాల ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఫలితంగా లక్షలాది రూపాయలు నష్టపోయే అవకాశం ఉంది. పశువులకు ఇన్సూరెన్స్ చేయిస్తేనే బీమా అందే అవకాశం ఉందని అధికారులు వివరిస్తున్నారు.

సాధారణంగా రైతులు పశువులను ఉదయాన్నే మేతకు వదిలి వేస్తుండడంతో అవి ఊర్లోకో, లేక అడవికో వెళ్లి మేతమేసి సాయంత్రానికి ఇంటికి వచ్చేవి. అయితే ఒక్కో పర్యాయం పశువులు వివిధ రకాల ప్రమాదాలకు గురవుతూ రైతులకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లుతుంటోంది. ఇటీవల మండలంలో టమటంవారిపల్లెలో నలుగురు రైతుల ఏడు పశువులను మేత కోసం వదిలి వేయడంతో అవిపొలాల్లో మేతకు వెళ్లి విద్యుత్ తీగకు తగలి అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో దాని విలువ రూ.80వేల నుంచి లక్ష విలువ చేసే పశువులు. పెద్దుళ్లపల్లె వాసులు ఇద్దరు రైతుల పశువులు బద్వేలు, పోరుమామిళ్ల రోడ్డు దాటి కొండకు మేతకు వెళుతుండడంతో రోడ్డు ప్రమాదంలో నాలుగు మృతి చెందాయి. మాధవరాయునిపల్లె గ్రామానికి చెందిన 20 మంది రైతుల పశువులను ఉదయాన్నే మేత కోసం విడిచి తోలడంతో అవి బద్వేలు, పోరుమామిళ్ల రహదారి దాటుతుండగా ప్రమాదాలకు గురై దాదాపు 30 పశువులు మృతి చెందాయి. తంగేడుపల్లె గ్రామానికి చెందిన ఓ రైతు తన మూడు పశువులను వదిలివేయడంతో అవి విద్యుత్ తీగలు తగిలి ప్రమాదానికి గురయ్యాయి. ఈ సంఘటనలు నిత్యం జరుగుతున్నా రైతులు పశువులను మేతకు వదిలేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో పశువులన్న రైతులు తమ పశువులను తోలుకుని వెళ్లి మేపి ఇంటికి తోలుకుని వచ్చేవారు. ఇప్పుడు పశువులను మేతకు వదిలివేయడం, అవి రైతుల పొలాల్లో ఏ పైరు ఉన్నా దానిని మేయడం కొందరు రైతులు తీవ్రంగా నష్టపోవడం దాంతో ఎన్నో ఘర్షణలు కూడా జరిగాయి. ఒక్కో రైతు ఎకరా పైరు సాగు చేయాలంటే రూ.30 వేలు మొదలు రూ. 40వేలు పెట్టుబడి వస్తుంది. తెలిసీ తెలియని పశువుల రైతులు వాటిని వదలడం ఆ రైతు వేసిన పైరు తినడంతో రైతుకు చాలా నష్టం జరుగుతున్నాయి. లక్షలకు లక్షలు వెచ్చించి పశువులను కొనుగోలు చేసి తెచ్చుకుని జాగ్రత్తగా కాపాడుకోవలసిన బాధ్యత ఉంది. అలా కాకుండా ఆ పశువులను వదిలేయడం అవి రకరకాల ప్రమాదాల బారిన పడి రైతులు ఎంతగానో నష్టపోతున్నారు. ప్రమాదాల్లో నష్టపోయిన రైతుల పశువులకు సక్రమంగా ఇన్సూరెన్స్ కూడా చేసి ఉండరు. మండలంలో ఒకరో ఇద్దరో పశువులకు ఇన్సూరెన్స్ చేస్తున్నారే తప్ప వాటి పైన అవగాహన లోపమో, లేక తెలియకపోవడమో తెలియదు కానీ పశువులకు అందరూ ఇన్సూరెన్స్ చేయడంలేదు. ఇప్పటికైనా పశువుల రైతులు తమ పశువులను జాగ్రత్తగా తోలుకుని వెళ్లి మేపి ఇంటికి తోలుకుని అలా కాకుండా వదిలేస్తే పంట పొలాలు వేసిన రైతులు ఆ పశువులతో నష్టపోవడమే కాక వారు పడే ఆవేదన అంతా ఇంతా కాదు. ఈ విషయమై పశువైద్యాధికారి వెంకటసుబ్బయ్యను అడగ్గా, పశువులను రైతులు మేతకు వదిలేయడం మంచి పద్ధతి కాదు, ప్రమాదాలకు గురైనప్పుడు వాటికి ఇన్సూరెన్స్ చేసి ఉంటే బీమా తప్పకుండా వస్తుందని ఇప్పటికైనా పశువు రైతులు తమ పశువులకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని ఆయన తెలిపారు.


టమటంవారిపల్లెలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన పశువుల కళేబరాలు


తంగేడుపల్లెలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన పశువులు

రైతులు పశువులను మేతకు వదిలేయడం మంచిది కాదు



పశువులను మేత కోసం రైతులు వదిలేసి చాలా తప్పు చేస్తున్నారని తమ పశువులను వారే కాసుకోవాలి. మేతకు వదిలేయడంతో రైతులు వేసిన పంటలను నాశనం చేస్తూ రైతుకు నష్టం చేకూరుస్తున్నాయి. పశువులను వదిలేయకూడదు.

- రైతు, దుగ్గిరెడ్డి, ఐత్రంపేట

ప్రమాదాల్లో పశువులు చనిపోతున్నాయి



తెలిసీ తెలియని రైతులు పశువులను మేత కోసం వదిలేస్తుండడంతో అవి రోడ్డు దాటుతూ, పొలాల్లో విద్యుత్ తీగలు తగిలి చాలా పశువులు చనిపోతున్నాయి. రైతులు జాగ్రత్తగా తమ పశువులను కాసుకుంటే మంచిది.

- రమణారెడ్డి రైతు, మాధవరాయునిపల్లె

జిల్లాలో టీబీ మందుల కొరత లేదు

రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్ వెల్లడి

కడప(కలెక్టరేట్) జూన్ 2: వైఎస్సార్ కడప జిల్లాలో ఎక్కడా టీబీ మందుల కొరత లేదని టీబీ జాయింట్ డైరెక్టర్ టి.రమేష్ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రొద్దుటూరు ఆస్పత్రుల్లో అవసరమైన టీబీ మందులు లేవని జరుగుతున్న ప్రచారం నిజం కాదన్నారు. అవసరమైన స్థాయిలో టీబీ నివారణ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. టీబీ రోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని. బయిట ఎవరూ కొనుగోలు చేయమని వైద్యులు సూచించ లేదని ఆయన ఆ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నీటికుంటలో పిడుగు పడి చేపలు మృతి

- రైతుకు మూడు లక్షల రూపాయలు నష్టం


చేపల చెరువు - ఇన్‌సెట్‌లో చనిపోయిన చేపలు

నిమ్మనపల్లి, జూన్ 2: కొండయ్యగారిపల్లి పంచాయితీ వెంకోజీగారిపల్లి రైతు సుధాకర్‌రావుకు చెందిన నీటికుంటలో శనివారం రాత్రి పిడుగు పడి టన్ను చేపలు మృతి చెందినట్లు రైతు తెలిపాడు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆరు నెలల కిందట సొంత నిధులతో 20కుంటల భూమిలో నీటి కుంటను ఏర్పాటు చేసి అందులో కొరమీను చేప పిల్లలను వదిలినట్లు తెలిపాడు. అయితే కొరమీను అమ్ముకునేందుకు దాదాపు 6నెలల కాలవ్యవధి వుండగా ప్రస్తుతం నెల రోజుల్లో చేపలను అమ్ముకొనే సమయంలో పిడుగు పడి దాదాపు 3లక్షల విలువైన టన్ను చేపలు చనిపోయినట్లు తెలిపారు. దీంతో దిక్కుతోచని పరిస్థితిలో చేపలను బయటకు తీసి పడేసినట్లు తెలిపారు. ఆదివారం సాయత్రం వరకు చనిపోయిన చేపలు నీటిలో తేలు తుండడంతో ఇంకా ఎక్కువగా నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఎంతో ఆశగా చేపల పెంపకాన్ని ప్రారంభించానని పిడుగు పడి చేపలు చనిపోయినట్లు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ అత్యంత కీలకం

అప్రమత్తతతో వ్యవహరించాలి : టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 2: జరగబోయే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్ అత్యంత కీలకంగా మారిందని... ప్రతి ఏజంటు అప్రమత్తంగా వ్యవహరించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సూచించారు. ఆదివారం కడప నగరం డీఎస్ఆర్ కల్యాణ మండపంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జోన్5 విభాగానికి సంబంధించి ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి ఒక్క ఏజంటు ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో ఆచితూచి వ్యవహరించాలన్నారు. ప్రతీది క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అలాగే లెక్కింపు ప్రక్రియలోని నిబంధనలు వారికి తెలిపారు. అనంతరం రిమ్స్ సమీపంలోని అబ్దుల్‌కలాం ఉర్దూ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డితో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ జోన్-5 ఇన్‌చార్జ్ వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, టీడీపీ నాయకులు బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బండారు మనోహర్‌నాయుడు, సీఎస్ మూర్తి, కర్నాటి అమర్‌నాదరెడ్డిలు పాల్గొన్నారు.


కౌంటింగ్ కేంద్రానికి వెళుతున్న టీడీపీ ప్రతినిధులు

ఏఎస్ఐ కొడుకు ఆత్మహత్య

కడప (క్రైం), జూన్ 2: పెండ్లిమర్రి ఏఎస్ఐ పుల్లయ్య కుమారుడు తూపల్లి సాయిక్రిష్ణ (28) ఆదివారం ప్రకాశ్‌నగర్‌లో ఆత్మహత్యకు పాల్పడినట్లు చిన్నచౌకు ఎస్ఐ రఫీ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. సాయిక్రిష్ణ ప్రైవేటుగా చదువుతూ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఆయన తండ్రి పెండ్లిమర్రిలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. పుల్లయ్య అనారోగ్యం వల్ల రెండు రోజుల కిందట కేరళ వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కొడుకు ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు తెలిపారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



వాల్మీకిపురం, జూన్ 2: వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రొద్దుటూరు వాసి వెంకటేశ్వర్లు, రుక్మిణి దంపతుల కుమార్తె చౌడేశ్వరి(29) కలకడ మండలం కదిరాయ చెరువుకు చెందిన మంజునాథతో తొమ్మిది నెలల కిందట వివాహం జరిగింది. మంజునాథ నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లెలో సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తూ వాల్మీకిపురం బజారు వీధిలో భార్య చౌడేశ్వరితో కలిసి కాపురముంటున్నాడు. శనివారం రాత్రి ఏం జరిగిందో తెలియదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చౌడేశ్వరి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వేధింపులతోనే తమ కుమార్తెను కడతేర్చినట్లు మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

ముగిసిన ఆంజనేయస్వామి తిరుణాల




ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి, ఆకట్టుకున్న చాందినీ బండి

సుండుపల్లె, జూన్ 2: మండలంలోని రాయవరం పంచాయతీలో ఆంజనేయస్వామి తిరుణాల ఆదివారం ఉదయం ముగిసింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మొక్కుబడుల్లో భాగంగా భక్తులు చాందినీ బండ్లతో ప్రదక్షిణలు చేశారు.

దండువారమ్మకు బోనాలు



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

సుండుపల్లె, జూన్2: మండలంలోని భాగంపల్లి గ్రామ పంచాయతీ కుంటల ముందరలో వెలసిన దండువారమ్మ జాతర సందర్భంగా ఆదివారం గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.అనంతరం అన్నదానం చేశారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో చాందినీ బండ్లు తిప్పనున్నారు.

ముగిసిన యల్లమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో యల్లమ్మ

వీరబల్లి, జూన్2: మండలంలోని వంగిమళ్ల గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న యల్లమ్మ జాతర ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలు పట్టి ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉప్పరపల్లి నుంచి భక్తులు చౌడేశ్వరిదేవి అమ్మవారిని ప్రత్యేక రథంలో జ్యోతుల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి యల్లమ్మను దర్శించుకున్నారు. చాందినీ బండ్లను కట్టించి మొక్కుల ను చెల్లించుకున్నారు. రాయచోటి రూరల్ సీఐ తులసీ రామ్, వీరబల్లి ఎస్ఐ చంద్రమోహన్‌లు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఘనంగా గంగమ్మకు పూజలు



అనంతపురం గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె జూన్ 2: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మకు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు భక్తులు బోనాలు సమర్పించారు. జాతరకు వచ్చు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు

కనుల పండువగా కలిబండ పాలేటమ్మ తిరుణాల



పాలేటమ్మ

చిన్నమండెం, జూన్2: మండలంలోని కలిబండ గ్రామంలో శనివారం రాత్రి పాలేటమ్మ తిరుణాల నిర్వహించారు. ఆ చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జంతు బలులు సమర్పించారు. చాందిని బండ్లు కట్టారు.

కొనలేం.. తినలేం..



● భారీగా పెరిగిన కూరగాయల ధరలు

సుండుపల్లె, జూన్ 2: వేసవిలో ఎండల తీవ్రతకు కూరగాయల ధరలు మండిపోతున్నాయి. పప్పులు సహా అన్ని రకాల నిత్యావసర ధరలు పెరిగిపోయాయి. బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. బీపీటీ రకం బియ్య 26 కేజీలు రూ.1500 వరకు పలుకుతోంది. లీటర్ నూనె ప్యాకెట్ ధర రూ.120 వరకు పలుకుతోంది. ధరల నియంత్రణపై అధికారులు దృష్టి సారించక పోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. కూరగాయల దిగుబడులు తగ్గిపోవడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. పచ్చిమిర్చి ధర వింటేనే వినియోగదారులకు ఘాటు తగులుతోంది. బెండకాయలు కొనాలంటే బెంగ పట్టుకుంటోంది. పరిస్థితి ఏమీ కొనలేం, ఏమీ తినలేం అన్న చందంగా తయారైంది. కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఎండల తీవ్రత, నీటి లభ్యత లేక సాగు చేయకపోవడం, ఉత్పత్తి తగ్గిపోవడం, దూర ప్రాంతాల నుంచి సరుకు రావడం తదితర కారణాల వల్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. టమోటా, బెండ, దొండ, వంకాయ, పచ్చిమిర్చి ధరలు అనూహ్యంగా పెరిగాయి. డిమాండుకు తగిన విధంగా సరుకు దిగుమతి కావడం లేదని దుకాణదారులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో అందుబాటులో ఉన్న ధరలు ఇప్పుడు అనూహ్యంగా పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమనే చెప్పాలి.

కొసరు ఊసే లేదు:

కూరగాయలు కొన్నప్పుడు కొద్దిగా కొత్తిమీర, కరివేపాకు అడగడం, ఇవ్వడం పరిపాటి. ప్రస్తుతం కొత్తిమీర చిన్నకట్ట రూ.30, పెద్దది రూ.60కి కొనాల్సి వస్తోంది. కరివేపాకు కావాలంటే రూ.10 చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. అల్లం కేజీ రూ.200, మునక్కాడ ఒకటి రూ.10 నుంచి రూ.15 వరకు పలుకుతోంది. నిమ్మకాయలు అయితే చిన్నకాయ సైతం రెండు రూపాయలు ధర పలుకుతుండటం గమనార్హం.

మాంసం ధరలు సైతం...

కోడి, మేక మాంసం, చేపలు ధరలు సైతం పెరగడంతో ప్రజలు తినడం తగ్గిస్తున్నారు. కేజీ కోడి మాంసం ధర రూ.270 నుంచి రూ.280 వరకు ఉంటే మటన్ ధర రూ.800 వరకు పలుకుతోంది. ఒక్కసారిగా వాటి ధరలకు రెక్కలు రావడంతో కూరగాయలపైనే ఆధారపడుతున్నారు. దీంతో కూరగాయల ధరలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయి. చౌకధరలకు లభించే వారపు సంతల్లో సైతం ధరలు అధికంగానే ఉండటం ఇబ్బందిగా మారుతోంది.

సామాన్యులం కొనలేం



కూరగాయల ధరలు ఇంతగా పెరగడం ఎప్పుడూ చూడలేదు. ధరల్లో పెరుగుదల తప్ప తగ్గడం కనబడటం లేదు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తినాలని సమావేశాల్లో అధికారులు చెబుతున్నారు. గతంలో రూ.500 కేటాయిస్తే నెలలో రెండు వారాలకు సరిపోయేవి. ప్రస్తుతం రూ.వెయ్యి వరకు దాటిపోతోంది. దినసరి కూలీలు, సామాన్యులు కూరగాయలను కొనలేక పోతున్నారు.

- రేవతి, మాచిరెడ్డిగారిపల్లె

ధరలు అదుపు చేయాలి



ధరలు అదుపు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతుల నుంచి కొనుగోలు చేసే ధరలకు వ్యాపారులు విక్రయించే వాటికి వ్యత్యాసం ఉంది. దీన్ని నివారిస్తే రైతులకు, వినియోగదారులకు లాభం చేకూరుతుంది.

- లక్ష్మీదేవి, చెన్నంశెట్టిపల్లె

ఫైనల్స్ చేరిన గాంధీనగర్,ముద్దుకృష్ణ జట్లు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందుకున్న ఎండీ ముక్రం

నందలూరు, జూన్ 2: నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్‌లో భాగంగా నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంటులో అరవపల్లె గాంధీనగర్ జట్టు, మంటపంపల్లె ముదు కృష్ణ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఆదివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో రైజింగ్ స్టార్ జట్టుపై గాంధీనగర్ లెవెన్స్ జట్టు విజయం సాధించి గాంధీనగర్ లెవెన్స్ ఫైనల్లోకి ప్రవేశించింది. మొదట బ్యాటింగ్ చేసిన గాంధీనగర్ జట్టు 14 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 92 పరుగులు చేసింది. జయకుమార్ 24 పరుగులు చేశాడు. అనంతరం విజయం కోసం బరిలో దిగిన రైజింగ్ స్టార్ జట్టు 14 ఓవర్లలో 90 పరుగులకు 5 వికెట్లను కోల్పోయి పరాజయం చెందింది. రైజింగ్ స్టార్ జట్టు బౌలర్ చంద్ర 4 ఓవర్లు వేసి 4 వికెట్లు తీసి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

కింగ్స్ డాబాపై ముద్దుకృష్ణ జట్టు విజయం

ఆదివారం మధ్యాహ్నం జరిగిన రెండవ సెమీఫైనల్ మ్యాచ్‌లో మంటపంపల్లె కింగ్స్ డాబా జట్టుపై మంటపంపల్లె ముద్దుకృష్ణ జట్టు విజయం సాధించి ఫైనల్‌లో ప్రవేశించింది. మొదట బ్యాటింగ్ చేసిన కింగ్స్ డాబా జట్టు 9 వికెట్లను కోల్పోయి 110 పరుగులు చేసింది. తిప్పేస్వామి 48 పరుగులు చేశాడు. ఎండి ముక్రం నాలుగు ఓవర్లలో 13 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీశాడు. అనంతరం 110 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన ముద్దుకృష్ణ జట్టు 9 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 114 పరుగులు చేసి విజయం సాధించింది. అహమ్మద్ ఆస్కరి 41, వాలి 21, ఎం.సాచి 28 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌కు క్రీడా కారులు చందు, రాము అంపైర్లుగా, అప్సర్, దినేష్‌లు స్కోరర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, రంజిత్, క్రీడా కారులు , క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు



గ్రామంలో పోలీసు బలగాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ

సుండుపల్లె, జూన్ 2: మండలంలో ఎవరైనా అల్లర్లు సృష్టించినా, శాంతి భద్రతలకు భంగం కలిగించినా చర్యలు తప్పవని ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్ తెలిపారు. ఆదివారం సుండుపల్లె మండల కేంద్రంలో పోలీసులు కవాతు నిర్వహించారు. కౌంటింగ్, ఫలితాల వెల్లడి అనంతరం ఎవరైనా దాడులకు ప్రోత్సహించినా, భయభ్రాంతులకు గురిచేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మండల కేంద్రంలోని పురవీధుల్లో పోలీసుల కవాతు నిర్వహించారు. మండలంలో ఎక్కడైనా శాంతి భద్రత లకు భంగం కలిగేలా జరిగినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. నాల్గవ తేదీన ఎవరూ మండల కేంద్రంలోకి రాకూడదని, అనవసరంగా గుంపులు గుంపులుగా తిరిగితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఒంటిమిట్ట : గ్రామాల్లో గొడవలు సృష్టించినా, నిబంధనలు పాటించకున్నా చర్యలు తప్పవని ఎస్ఐ మధుసూదన్‌రావు అన్నారు. ఆదివారం మండల వ్యాప్తంగా పోలీసు బలగాలతో ర్యాలీ నిర్వహించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నలుగురికి మించి గుంపు కూడా ఉండకూడదన్నారు. అనవసరంగా వాహనాల్లో రోడ్ల మీదకు రావద్దని అనుమతి లేని వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. రెండు రోజుల పాటు దుకాణాలను మూసివేయాలని, మెడికల్ షాపులు మినహా అత్యవసర సేవలు మాత్రమే ప్రజలకు అందుబాటులో వుంటాయన్నారు.

చిట్వేలి: మండలంలో 144, 130 సెక్షన్లు అమల్లో ఉన్నందున హోటళ్ళు, టీ దుకాణాలు పెట్టరాదని ఎస్ఐ సుధాకర్ మైక్‌ల ద్వారా ప్రచారం చేశారు. దుకాణాల వద్ద నలుగురు అంతకంటే ఎక్కువ మంది గుమికూడటం, రెచ్చగొట్టే మాటలు మాట్లాడటం, టపాకాయలు పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిషేధించినట్లు తెలిపారు. ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూన్ 2:మండలంలోని చెర్లోపల్లె సమీపంలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు చెల్లించారు. ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

నిమ్మనపల్లి, జూన్ 2: మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతి బాలినాయునిపల్లెలో ఆదివారం సర్పయాగం హరికథతో మహాభారత యజ్ఞం ప్రారంభించారు. పగలు హరికథ. రాత్రి నాటకం ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భాగవతారిణి మంజుల, హార్మోనియం నారాయణప్ప, తపలిస్టు సదాశివ ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చిన్నపాటి వర్షానికేవీధులన్నీ జలమయం

రైల్వేకోడూరు, జూన్ 2: పట్టణంలోని రోడ్లు కొద్దిపాటి వర్షానికే జలమయం అవుతున్నాయి. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి రంగనాయకులపేట తదితర ప్రాంతా ల్లో రోడ్లు జలమయం అయ్యాయి. పాదచారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. జగదంపల్లె, కొత్తబజారు తదితర ప్రాంతాల్లో సిమెంట్లు రోడ్లున్నా నీరు నిలవడంతో చిన్న పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రతి సోమవారం మల్లయ్యకొండకు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, జూన్ 2: మదనపల్లె నుంచి ప్రతి సోమవారం మల్లయ్యకొండకు రెండు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు షటిల్ సర్వీసులుగా తిరిగి సాయంత్రం మదనపల్లె వస్తాయని వివరించారు.

నేటి రాత్రి నుంచి మద్యం షాపులు బంద్

ఎర్రగుంట్ల, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలోపెట్టుకుని 3వ తేదీ రాత్రి నుంచి మద్యం షాపులు మూయనున్నట్లు ఎక్సైజ్ సీఐ సుభాషిణి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న షాపుల న్నింటి తోపాటు బార్లు రాత్రి 11గంట లకు, రెస్టారెంట్లు రాత్రి 10గంట లకు మూసివేస్తున్నట్లు తెలిపారు. తన పరిధిలోని 84షాపులకు ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. మద్యం షాపులు 3వ తేదీ రాత్రి నుంచి 5వ తేదీ ఉదయం వరకు మూస్తుండటంతో మందుబాబులు షాపుల వద్ద ఎగబడ్డారు. దీంతో దాదాపు అన్ని షాపులు కిటకిటలాడాయి. దీనికి తోడు ఆదివారం కూడా కావడంతో మరింత రద్దీ పెరిగింది. ప్రతి రోజూ ఉదయాన్నే మద్యం తాగే అలవాటు ఉన్నవారు తెల్లవారుజామునే బ్లాకులో కొని తాగుతున్నారు. బ్లాకులో అమ్ముకునే వారు ముందస్తుగా స్టాకు పెట్టుకుంటున్నట్లు తెలిసింది. దీంతో మద్యంషాపుల వద్ద చాలా రద్దీ పెరిగిందని పేర్కొంటున్నారు.

పాలిటెక్నిక్ కౌన్సిలింగ్‌కు 400 మంది విద్యార్థులు

మదనపల్లె టౌన్, జూన్ 2: పాలిసెట్‌లో ర్యాంకులు పొందిన 400 మంది విద్యార్థులు జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన కౌన్సిలింగ్‌కు హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మే 27వ తేదీ నుంచి జూన్ 2 వరకు నిర్వహించిన ఏడు రోజుల కౌన్సిలింగ్‌లో 400 మంది విద్యార్థులు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారన్నారు. మూడో తేదీ కూడా వెరిఫికేషన్ వున్నా..ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉండటం కారణంగా కౌన్సిలింగ్‌ను ఈనెల 6వ తేదీకి వాయిదా వేశారన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి 6వ తేదీ కౌన్సిలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తంబళ్లపల్లె, జూన్ 2: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అఫీసర్ (డీఎస్‌డీవో) గౌస్‌బాషా అన్నారు. స్థానిక పాత కళాశాల మైదానంలో జిల్లా స్పోర్ట్స్ ఆధ్వర్యంలో శిక్షకుడు యూసఫ్ గత నెల రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎస్ఐ శివకుమార్, మెడికల్ ఆఫీసర్ వెంకట్రామయ్య, జిల్లా పీడీల సంఘం ప్రెసిడెంట్ రమేష్, సీనియర్ పీడీలు భద్రయ్య, ఖాదర్‌బాషా, ఆర్పీ కోచ్ రవీంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..క్రీడలు ఆడటం వలన మానసిక ఒత్తిడిని జయించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. యువత సామాజిక మాధ్యమాల వినియోగం తగ్గించి చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చాటిన పిల్లలకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, స్పాన్సర్లు, స్థానిక సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు, పిల్లల తల్లితండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి

గాలివీడు, జూన్ 2: రాష్ట్రంలో వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులకు సరిపడా పత్తి, వేరుశనగ, వరి విత్తనాలు, ఎరువులు, జీలుగలు మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి కోరారు. ఆదివారం గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులం దరికీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముందుగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు ఏ ఎరువులు వాడాలో అవగాహన కలిగించాలని కోరారు. కౌలు రైతులకు భూ యజమానులకు సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అవకతవకలుగా ఉన్న భూ సర్వేను రద్దు చేసి రైతుల సమక్షంలో గ్రామస్థాయి రెవెన్యూ అధికారులు రీ సర్వే చేసి, పాత పాసుపుస్తకాలను అనుసరించి సవరించాలని కోరారు. రైతుల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉన్న భూసర్వే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



మండల టాపర్‌కు బహుమతి అందజేస్తున్న యాస్మిన్

సుండుపల్లె, జూన్2: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మానవత ఆధ్వర్యంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 500 మార్కులుపైన వచ్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నూరే ఉజ్మాకు బ్రైట్ ట్యుటోరియల్స్ నిర్వాహకురాలు యాస్మిన్ రూ.3 వేలు ప్రోత్సాహకం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు హరికుమార్, అరీఫుల్లా, రవీంద్రారెడ్డి, ఇస్మాయిల్, నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సంబేపల్లె, జూన్ 2: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు డ్రా యింగ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయశాఖ అధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు. సోమ వారం జూన్ 3వ తేదీ జనరల్ నాలెడ్జ్, ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులకు జూన్ 7వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల ద్వారా పిల్లలు తమ మేధాశక్తిని పెంపొందించు కోవచ్చునన్నారు. సమ్మర్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గాలివానకు ఎగిరిపోయిన పైకప్పు రేకులు



గాలివానకు ఎగిరిపోయిన రేకులు

రామాపురం, జూన్ 2: మండలం లోని కుమ్మరపల్లి గ్రామ పంచాయతీ లోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి వీచిన గాలివానకు పలు ఇళ్ల పైకప్పునకు వేసిన రేకులు ఎగిరి పోయాయి. మరో ఇంటిపై విద్యుత్ స్తంభం విరిగి పడింది. కుమ్మరపల్లి పంచాయతీలోని దూదేకులపల్లెలో సుంకేల కృష్ణయ్య, రాజు, బండపల్లె లో షేక్. ముబారక్, మోహన్, లక్ష్మయ్య, జమాల్‌వల్లి ఇళ్లపై ఏర్పాటు చేసిన రేకులు గాలివానకు లేచిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. అదే గ్రామానికి చెందిన షేక్. అబ్దుల్‌సాట్ ఇంటిపై విద్యుత్ స్తంభం పడడంతో రేకులు విరిగి పడ్డాయి. ఇళ్లల్లో ఉన్న పిల్లలు, పెద్దలు, మహిళలు భయంతో బయటికి పరుగులు తీశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఇప్పటి వరకూ అధికారులెవరూ గ్రామాన్ని సందర్శించలేదని గ్రామస్తులు తెలిపారు.

ఎన్నికల ఫలితాలపై నేతల చర్చలు



చర్చించుకుంటున్న సుగవాసి బాలసుబ్రమణ్యం, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూన్2: మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీ కుర్వపల్లెలో కోటకడ వెంకట్రమణ ఇచ్చిన విందు కార్యక్రమానికి రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబులు హాజరయ్యారు. వీరు విందు అనంతరం అక్కడ ఉన్న టీడీపీ కార్యకర్తలు, ఓటర్లతో మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ సరళి పై చర్చించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నాల్గవ తేదీ జరిగే కౌంటింగ్‌లో ఎన్డీఏ కూటమి భారీ ఆధిక్యంతో గెలవడంతో పాటు రాయ చోటి, రాజంపేట రెండు అసెంబ్లీ స్థానాలు సైతం టీడీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. వీరివెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు విందులో పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి టీడీపీ నేతల పూజలు

సిద్దవటం, జూన్ 2: రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారం రావాలని, చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల ని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో ఆదివారం కడప జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు కుప్పాల వెం కట సుబ్బయ్య ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రావాలని ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశామని తెలిపారు. అమరావతి కోసం రైతులు భూములు ఇస్తే రైతాంగాన్ని నట్టేట ముంచారని రైతుల గోడు వైసీపీకి శాపంగా మారిందన్నారు. రాష్ట్రంలో మెరుగైన పరిపాలన చంద్రబాబు నాయుడుకే సాధ్యమని, నిజం గెలవాలని ప్రత్యేక పూజలు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

26 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లకు ఎంపిక చేస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, జూన్ 2: చెన్నముక్కపల్లె గ్రామంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 26 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. 40 మందికి పరీక్షలు నిర్వహించి 26 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మందికి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, కోశాధికారి శివప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, లయన్స్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ శివరామిరెడ్డి, లయన్ జయరామిరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, అఫ్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనుగాలులతో భారీ నష్టం

పెనగలూరు, జూన్ 2 : శనివారం రాత్రి ఆకస్మాత్తుగా వీచిన గాలుల వల్ల మండలంలోని కొన్ని ప్రాంతాల్లో రైతులకు భారీ నష్టం జరిగింది. మామిడి, బొప్పాయి, అరటి, తోటలు కొంత వరకు దెబ్బతిన్నాయి. ఇదిలా వుండగా పెనుగాలులకు బెస్తపల్లె, నల్లపురెడ్డిపల్లె, చక్రంపేట, కడిమివారిపల్లె, ప్రాంతాలలో చెట్లు విరిగి కరెంటు స్తంభాలు పడిపోవడంతో ప్రజలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే విద్యుత్ శాఖాధికారులు రంగంలోకి దిగి ఆదివారం సాయంత్రానికల్లా విద్యుత్‌ను పునరుద్ధరించారు.

వైభవంగా గంగమ్మ జాతర



గంగమ్మ సన్నిధిలో నరసింహప్రసాద్

పెనగలూరు, జూన్ 2 : మండలంలోని కట్టవారిపల్లె హరిజన వాడలో ఆదివారం గ్రామ దేవత గంగమ్మ జాతర నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి పూలు, పండ్లు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. జంతు బలులు సమర్పించారు.టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ తన అనుచరులతో కలిసి గంగమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ కూటమి విజయం తథ్యమని చంద్రబాబునాయుడు మరోమారు ముఖ్యమంత్రి కాబోతున్నారన్నారు. ఆయన వెంట మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబత్తిన సురేష్‌బాబు, మండల బీజేపీ అధ్యక్షుడు మన్నెం మల్లికార్జున, బీజేపీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సుబ్రమణ్యం తదితరులు వున్నారు.

బైరెడ్డిపల్లిలో అత్యధిక వర్షపాతం



గుడిపాల మండలం ఏఎల్ పురంలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభం, బైరెడ్డిపల్లె మండలంలో విరిగిన విద్యుత్ స్తంభంపై భాగం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2: జిల్లాలో నాలుగు మినహా మిగిలిన 28 మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుండడంతో శనివారం ఉదయం 8 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు పలుచోట్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బైరెడ్డిపల్లిలో 63.6మి.మీ, అత్యల్పంగా పాలసముద్రంలో 1.2 మి.మీ నమోదైంది. గుడుపల్లి 56.4, కుప్పం 54.0, గుడిపాల 36.0, పెనుమూరు 27.0, యాదమరి 23.0, చిత్తూరు అర్బన్ 19.4, ఐరాల 18.2, రామకుప్పం 18.2, బంగారుపాళ్యం 17.2, వి.కోట 16.2, తవణంపల్లె 15.6, శాంతిపురం 15.4, విజయపురం 15.2, పులిచెర్ల 14.2, సోమల 10.4, సదుం 10.2, చిత్తూరు రూరల్ 10.2, శ్రీరంగరాజపురం 8.2, పూతలపట్టు 8.0, వెదురుకుప్పం 6.4, పుంగనూరు 4.2, గంగాధరనెల్లూరు 4.2, పలమనేరు 3.4, చౌడేపల్లి 2.6, గంగవరం 2.4, పెద్దపంజాణిలో 2.0 మి.మీ నమోదైంది.

నేల కూలిన విద్యుత్తు స్తంభాలు

శనివారం రాత్రి కురిసిన గాలీవానకు పెనుమూరు మండలంలోని పలు చోట్ల విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. గుడిపాల మండలంలో 10 విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. కొత్తపల్లి దళితవాడలో పిడుగుపాటుకు మేక మృతిచెందింది. అరటి, మామిడికాయలు నేలపాలయ్యాయి. కుప్పంలో ఒక టైల్స్ షెడ్డు కూలిపోయింది. బైరెడ్డిపల్లె మండలం టీఎన్‌కుప్పం వద్ద నేల కూలిన టేకు వృక్షం విద్యుత్ తీగలపై పడటంతో 33 కేవీ విద్యుత్ స్తంభం పైభాగం విరిగి పోయింది.

రైల్వే ట్రాక్‌పై విరిగిపడిన చెట్టుకొమ్మలు



పాకాల: తిరుపతి జిల్లా పాకాల-తిరుపతి రైల్వే మార్గంలో గాదంకి సమీపాన ఆదివారం సాయంత్రం రైల్వే ట్రాక్‌పై గాలివానకు చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో తిరుపతి నుంచి బెంగళూరు వెళ్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ పరిస్థితి గమనించి.. రైలు నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. రైల్వేసిబ్బంది చెట్టుకొమ్మలు తొలగించడంతో అరగంట ఆలస్యంగా వెళ్లింది.

పుత్తూరులో పిడుగుపాటుకు 5 ఆవుల మృతి



పుత్తూరు: మండలంలోని పరమేశ్వరం మంగళం పంచాయతీలోని జయరాణీపురం గ్రామ పొలిమేరలో ఓ చెట్టు కింద ఆవులు గడ్డిమేస్తుండగా పెద్ద శబ్దంతో ఆదివారం ఉదయం పిడుగు పడింది. దీంతో ఐదు ఆవులు షాక్‌కు గురై కుప్పకూలిపోయి మృతి చెందాయి.తనకు నష్టపరిహారం ఇప్పించాలని వాటి యజమాని శ్యామల.. ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

ఒక్కరోజు ఓపిక పట్టు!

కుప్పంలో పెరుగుతున్న 'కౌంటింగ్' వేడి

కుప్పం, జూన్ 2: రాష్ట్రంలోనే కీలక నియోజకవర్గమైన కుప్పంలో కౌంటింగ్ వేడి అమాంతం పెరిగిపోయింది. మధ్యలో ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉన్న సమయంలో వర్గాలుగా విడిపోయిన వ్యక్తులు విధ్వంస లక్ష్యాలను కూడా విధించుకుంటున్నారన్న ప్రచారం వారం పది రోజులుగా చక్కర్లు కొడుతోంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పోటీ చేస్తున్న కుప్పంపైనే తొలినుంచీ అందరి దృష్టీ కేంద్రీకృతమైంది. ఇక్కడ ఆయనను ఓడించే అంత సీను ఉన్నదో లేదో కానీ, మెజారిటీ గణనీయంగా తగ్గించడానికి మాత్రం సాక్షాత్తు మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలకు ముందు సామదాన భేద దండోపాలన్నీ ప్రయోగించేశారు. వైసీపీ నుంచి చంద్రబాబుకు పోటీగా భరత్ బరిలో ఉన్నారు. ఎగ్జిట్ పోల్స్ వెలువడిన నేపథ్యంలో ఫలితాల గురించి చర్చోపచర్చలు అధికమైపోయాయి. చంద్రబాబుకు 60-70 వేల మెజారిటీ వస్తుందని, లేదు.. 25 వేల మెజారిటీతో భరత్ గెలిచిపోతున్నాడని బెట్టింగ్‌లు ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడిలా బెట్టింగ్‌లు పెట్టిన వారితోపాటు, ఆయా రాజకీయ పార్టీల వ్యక్తులు కూడా రెచ్చిపోవడం ప్రారంభిస్తున్నారు. దాదాపు బహిరంగంగానే చర్చలకు తెర తీస్తున్నారు. ఫలితాల విడుదలకు ఒక్క రోజు మాత్రమే మిగిలిన క్రమంలో కుప్పంలో ఉద్రిక్తత తారస్థాయికి చేరుకుంటోంది.

> 'అదే చెబుతున్నాం, ఒకరోజు ఓపిక పట్టు అని.' 'వెయిట్ చేస్తే తెలుస్తుంది, ఏముంటుంది రా అని.'
> .. ఒక వాట్సాప్ గ్రూపులో జరిగిన వాదోపవాదాలలో ఇది శాంపుల్ మాత్రమే. ఈ గ్రూపులో ఇంతకన్నా తీవ్రమైన వ్యాఖ్యలున్నాయి.

> 'ఆ పార్టీ గెలిస్తే వారి పైన దాడి చేస్తారంట కదా, నిజమేనా?' 'నిజమేనంట. ఈ పార్టీ వేల్లు కూడా తాము గెలిస్తే ఆ రెండింటినీ వదిలే ప్రసక్తే లేదని ఒట్టు పెట్టుకుంటా వుండారంట.'
> .. కుప్పంలో ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా జరుగుతున్న సంభాషణ ఇది.

హాస్పిటల్స్ టార్గెట్?

ఏ రాజకీయ పార్టీ అయిన గెలుపోటములు సహజం. కానీ కుప్పంలో దీన్ని అంగీకరించే పరిస్థితుల్లో ఆయా పార్టీ వర్గాలు ఉన్నట్లు కనిపించడంలేదు. కొద్దిరోజులుగా గ్రామాలలో పెరుగుతున్న ఉద్రిక్తతలే దీనికి నిదర్శనం. కుప్పం మండలం ఎన్.కొత్తపల్లెలో కేవలం తాగునీటి సరఫరా బకాయి అడిగినందుకు వైసీపీ కార్యకర్త ఒకరు, టీడీపీ కార్యకర్తలైన జయశంకర్, రెడ్డిపై దాడి చేసి తీవ్రంగా కొట్టిన సంఘటన తాజాగా చోటు చేసుకుంది. కేవలం నెల్లాళ్ల వ్యవధిలో నియోజకవర్గ వ్యాప్తంగా ఇటువంటి సంఘటనలు ఆరేడు జరిగాయి. పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. ఈసారి కుప్పం పట్టణంలోని మూడు హాస్పిటల్స్‌ను కొందరు టార్గెట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధి... టీడీపీకి నాయకుడిది మరొకటి.. మూడవది టీడీపీ నాయకుడి సంతానం నిర్వహణలో ఉన్న హాస్పిటల్. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఏ హాస్పిటల్స్ టార్గెట్ అవుతాయో సులువుగా అర్థమవుతుంది. ఈ చర్చ వారం రోజులనుంచి పట్టణంలో విస్తృతంగా జరుగుతోంది. ఈ ప్రచారానికి భయపడిపోయిన ఆయా యాజమాన్యాలు తమ హాస్పిటల్స్ వద్ద సీసీ కెమెరాల సంఖ్య పెంచుకుంటున్నారు. ప్రైవేటు సైన్యాన్ని కూడా నియమించుకుంటున్నట్లు తెలిసింది. కేవలం హాస్పిటల్స్ మాత్రమే కాకుండా ఇతర ఆస్తుల మీద కూడా ఇప్పటికే కొందరి దృష్టి పడిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.



కుప్పం టీడీపీ కార్యాలయం ఎదుట పోలీసు నిఘా

గ్రామాలలో పెరుగుతున్న ఉద్రిక్తత

కుప్పంలో గొడవలకు పేరుపడ్డ ప్రాంతాలైన కొత్తపేట, పాతపేట, బాబునగర్ వంటి చోట్ల ఇప్పటికే పోలీసులు తగు నిఘా ఏర్పాటు చేశారు. టీడీపీ, వైసీపీ కార్యాలయాలు, ఎమ్మెల్సీ భరత్ నివాసం, ముఖ్య ప్రాంతాలలోనూ బందోబస్తు ఉంచారు. గ్రామాలమీద పోలీసులు ఇంకా తగినంత ఫోకస్ పెట్టినట్లు కనిపించడంలేదు. అందుకనే గ్రామస్థాయిలో దాడులు జరుగుతూ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కువగా ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు నివశిస్తుంటారు. పార్టీలు ఏవైనా సరే, వీరిమధ్య చాలా వరకు పరస్పర అవగాహన, కలిసిమెలిసి పనిచేసే తత్వం ఉంటుంది. కానీ పల్లెల్లో ఈ గుణం చాలా తక్కువ. స్థానిక సంస్థల ఎన్నికలప్పుడు ఏర్పడ్డ ఘర్షణ జ్వాలలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. అంతేకాక పోలింగ్ సమయంలోనూ ఇరు పార్టీ శ్రేణుల మధ్య పెద్ద గొడవలు జరుగకపోయినా, చాలాచోట్ల ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. కాబట్టి ఫలితాల సమయంలోనూ, తర్వాత కూడా గ్రామాలలో గొడవలు చోటు చేసుకునే ప్రమాదం అధికంగా ఉంటుంది. పోలీసులు అటువైపు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు సన్నద్ధం : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 2: జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. ఆదివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వర్చువల్ విధానంలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సమీక్షిం చారు. చిత్తూరు నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం కౌంటింగ్ పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండో విడత ర్యాండమైజేషన్ చేశామని తెలిపారు. సోమవారం కౌంటింగ్ సిబ్బందికి ఎస్వీసెట్‌లో రెండో విడత శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లెక్కింపు కేంద్రం ఆవరణలో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.



రాజకీయ పార్టీల సమావేశంలో సూచనలిస్తున్న కలెక్టర్

పారదర్శక కౌంటింగ్‌కు సహకరించండి

ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ కోరారు. ఆదివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లాకు నియమితులైన ఐదుగురు కేంద్ర ఎన్నికల పరిశీలకులు, జేసీ శ్రీనివాసులు, రాజకీయల పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లు చేశామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించరాదని, లెక్కింపు వ్యవహారంలో సందేహాలు వస్తే అక్కడి ఆర్వోలకు తెలియజేయాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రం ఆవరణలో విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. డీఆర్వో పుల్లయ్య, రిటర్నింగ్ అధికారులు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, పరదేశి, రాహుల్, కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

రూ.10 లక్షల నగదు సీజ్

చిత్తూరు, జూన్ 2: ఎలాంటి రసీదులూ లేకుండా తీసుకెళుతున్న నగదును రెండో పట్టణ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఉలసయ్య వివరాల మేరకు... డీఐ రోడ్డులోని తోటపాళ్యం క్రాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. చిత్తూరు మండలం పచ్చనపల్లెకు చెందిన జ్ఞానశేఖర్‌రెడ్డి(48) ఎలాంటి రసీదులూ లేకుండా రూ. 10 లక్షలు తీసుకెళుతుండగా స్వాధీనం చేసుకుని, ఖజానా శాఖకు అప్పగించారు. ఆధారాలు చూపించి డబ్బు తీసుకోవాలని సూచించారు.

గూడ్స్ ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



కుప్పం, జూన్ 2: కుప్పం రైల్వే స్టేషన్ ఎదురుగా ఆదివారం రాత్రి గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. రైల్వే టికెట్ కోసం పట్టాలు దాటుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు చూసినవారు చెబుతున్నారు. మృతదేహం వద్ద లభించిన గుర్తింపు కార్డును బట్టి, మృతుడిని రామకుప్పం మండలం బగలనత్తం గ్రామవాసి శశికుమార్‌గా గుర్తించారు. ఇతడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ రెండురోజుల క్రితం సొంత గ్రామానికి వచ్చారు. తిరిగి బెంగళూరు వెళ్లడానికి ఆదివారం రాత్రి కుప్పం రైల్వేస్టేషన్ చేరుకుని, కౌంటర్లో టికెట్ తీసుకున్నారు. ఇంతలో రైలు రావడం గమనించి, పట్టాలమీదుగా ఒకటో ప్లాటుఫామ్ నుంచి రెండవ ప్లాట్‌ఫామ్‌కు పట్టాల మీదుగా వెళ్ళడానికి ప్రయత్నించారు. అదే సమయంలో వేగంగా వస్తున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో శశికుమార్ అక్కడికక్కడే మృతి చెందారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు

తిరుమల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది.

గంధమనేని శివయ్య సతీమణి మృతి

పిచ్చాటూరు, జూన్ 2: పుత్తూరు మాజీ ఎమ్మెల్యే దివంగత గంధమనేని శివయ్య సతీమణి పారిజాతమ్మ(84) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. పిచ్చాటూరు మండలం గోవర్థనగిరి గ్రామానికి చెందిన గంధమనేని శివయ్య సీపీఐకి 1970వ దశకంలో కీలక నేతగా వ్యవహరించారు. 1972-77 మధ్యకాలంలో ఈయన పుత్తూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. శివయ్య సతీమణి పారిజాతమ్మ వృద్ధాప్య రీత్యా ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు చెన్నైలో కన్ను మూసినట్లు కుమారుడు గంధమనేని గౌతమ్ వెల్లడించారు. అంత్యక్రియలు సోమవారం సాయంత్రం చెన్నై కోడంబాక్కం ఎన్టీఆర్ స్ట్రీట్‌లోని స్వగృహంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



పారిజాతమ్మ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి భద్రతపై ప్రత్యేక దృష్టి

- ప్రతి రెండు గ్రామాలకో సాయుధ బలగంతో కూడిన పెట్రోలింగ్ పార్టీ
- అదనంగా రెండు గ్రేహౌండ్స్ పార్టీలు
- ఈవీఎంల భద్రతకు ఢోకా లేదు
- ఇప్పటికే అదుపులో 200 మంది కీలక ట్రబుల్ మాంగర్స్
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



అబ్జర్వర్‌కు వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ, కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: పద్మావతి మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూమ్‌లోని పోల్డ్ ఈవీఎంల భద్రతకు ఎలాంటి ఢోకా లేదని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ప్రధానంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండటానికి పటిష్ఠ చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లా ప్రజలు చాలా మంచి వారన్నారు. అటువంటి వారిని కొందరు నాయకులు, వారి అనుచరులు రెచ్చగొట్టి గొడవలకు ప్రేరేపిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే కౌంటింగ్ ప్రక్రియకు ఇబ్బందులు సృష్టిస్తారని భావించిన దాదాపు 200 మంది కీలక వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇక చంద్రగిరి నియోజకవర్గంలో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఇక్కడ ఓ అదనపు ఎస్పీ పర్యవేక్షణలో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 200 మంది బలగాలను నియమించామన్నారు. వీరు కాకుండా రెండు గ్రేహౌండ్స్ పార్టీలను కేటాయించామన్నారు. వీరివద్ద లాఠీలతోపాటు తుపాకులూ ఉంటాయన్నారు. అలాగే ప్రతి రెండు గ్రామాలకో సాయుధ బలగంతో కూడిన పెట్రోలింగ్ పార్టీని ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఎక్కడ అల్లర్లు జరిగినా 10 నిమిషాల వ్యవధిలోనే సంబంధిత ప్రాంతాలకు చేరుకునేలా బలగాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

శ్రుతి మించితే లాఠీలకు పని చెప్పండి

కౌంటింగ్‌కు ఇబ్బందులు కల్గించేలా వ్యవహరిస్తూ- శ్రుతిమించే పరిస్థితులొస్తే మాత్రం లాఠీలకు పనిచెప్పాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. ఆదివారం మహిళా వర్సిటీలో పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే నిర్దేశిత గేట్ల ద్వారా కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించాలన్నారు. మీడియా పాయింట్ వరకు కెమెరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వెనుక తుమ్మలగుంట రోడ్డు వైపు ఉన్న పార్టీలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా పరువు పోకుండా ప్రజా ప్రతినిధులు సహకరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ అధికారి సరిత, అదనపు ఎస్పీలు కులశేఖర్, విమలకుమారి, వెంకట్రావు, సాయుధ దళం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అబ్జర్వర్

తిరుపతి(నేరవిభాగం/కలెక్టరేట్), జూన్ 2: తిరుపతిలో కౌంటింగ్ పరిశీలన కోసం నియమితులైన స్పెషల్ పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రాకు ఆదివారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పద్మావతి మహిళా వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఏర్పాట్లను అబ్జర్వర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ, కలెక్టర్‌కు ఆయన పలు సూచనలిచ్చారు.

ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

- స్కూటర్‌ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



చంద్రగిరి, జూన్ 2: చంద్రగిరి మండలం, కోదండరామాపురం వద్ద పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి స్కూటర్‌ని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీకి చెందిన అమ్ములు(38), ఎస్వీ నగర్‌కు చెందిన విశ్వం(28) తిరుపతి వ్యవసాయ కళాశాలలోని మెస్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. సొంత పనుల నిమిత్తం చిత్తూరుకు స్కూటర్‌పై వెళ్ళి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కోదండరామాపురం వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో అమ్ములు, విశ్వం తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

31మంది టీడీపీ నేతలకు బెయిల్ మంజూరు

హత్యాయత్నం కేసులో ఊరట

తిరుపతి(నేరవిభాగం), జూన్ 2: తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ, స్విమ్స్ ఆస్పత్రి వద్ద జరిగిన గొడవల్లో 37మంది టీడీపీ నేతలపై నమోదైన హత్యాయత్నం కేసులో 31 మందికి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. మిగిలినవారు విదేశాల్లో ఉండటంతో వీరు బెయిల్ పిటిషన్ వేయలేదు. వివరాలిలా.. పద్మావతి మహిళా వర్సిటీ, స్విమ్స్ ఆస్పత్రి వద్ద మే 14వ తేదీన టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య గొడవలు, ఘర్షణలు, విధ్వంసాలు చోటు చేసుకున్నాయి. దీనిపై టీడీపీ నాయకులు కొందరు తమపై దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ గత నెల 26వ తేదీన తిరుపతి శివారు ప్రాంతమైన తిరుమలనగర్‌కు చెందిన వైసీపీ కార్యకర్త ఎ.రాజీవ్ ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన జరిగిన 12 రోజుల తర్వాత ఫిర్యాదు చేస్తే.. పోలీసులు కనీసం విచారించకుండా తమపై అన్యాయంగా హత్యాయత్నం కేసు నమోదు చేశారని బెయిల్ పిటిషన్‌లో టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత 31మందికి షరతులతో కూడి న బెయిల్‌ని హైకోర్టు మంజూరు చేసింది. 'బెయిల్ మంజూరైన వారంతా ఈనెల 7వ తేదీ వరకు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో తిరగకూడదు. కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లుగా ఉండకూడదు. ఈనెల 13వ తేదీ వరకు ప్రతి మూడ్రోజులకోసారి రేణిగుంట పోలీసు స్టేషన్‌లో హాజరై, సంతకాలు చేయాలి' అని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి కేసు విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

12న కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డుల పంపిణీ

చిత్తూరు కల్చరల్, జూన్ 2: చిత్తూరులోని రాజామహల్ హోటల్‌లో ఈ నెల 12న ఉదయం 11 గంటలకు కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డులను పంపిణీ చేయనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కె. రామలక్ష్మి ఆదివారం తెలిపారు. కుప్పం రెడ్డెమ్మ జాతీయ స్థాయి నవల, కథానికల పోటీలకు 2023వ సంవత్సరంలో వివిధ మాధ్యమాల్లో ప్రచురితమై మన్ననలు పొందిన రచనలకు బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వీటిలో.. నవలల విభాగంలో కె.ఎ.మునిసురేష్‌పిళ్లై రచించిన పుత్రిక శత్రు, సి.కాశీపురం ప్రభాకర్‌రెడ్డి రచించిన మేడం ఎంపికయ్యాయని సంస్థ అధ్యక్షురాలు డా.పి.రోజాప్రియ పేర్కొన్నారు. కథానికల పోటీలలో రోహిణి పంజారి రచించిన నల్లసూరీడు, డాక్టర్ ఎం.సుగుణరావు రచించిన సుగుణకథాభిరామం ఎంపికైనట్లు సంస్థ కార్యదర్శి డా.సి.నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, జూన్ 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి, వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శన టిక్కెట్ల ద్వారా 1,610మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,830మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,962మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,089, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 272మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 251మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 66మంది భక్తులు పూజలు రాహుకేతు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 17,319 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.



రాహుకేతు మండపం వద్ద భక్తులు

ఆగని గజదాడులు

పంటలపై స్వైరవిహారం - పొలాల వద్ద రైతుల కాపలా

సోమల, జూన్ 2: సోమల మండలంలో ఏనుగులు దాడులు ఆగడంలేదు. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి పేటూరు పంచాయతీలో సంచరించిన ఏనుగులు మామిడి తోటల్లో కోతకు సిద్ధంగా ఉన్న కాయలను తిన్నంత తిని తొక్కేశాయి. చెట్లను వేళ్లతో పెకలించాయి. తోటల్లోని బోరు పైపులు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. పేటూరు చెందిన చిట్టి, విష్ణు, ప్రసాద్, సుబ్రమణ్యం, చంద్ర తదితరుల టమోటా, మామిడి పంటలలో విధ్వంసం సృష్టించాయి. ఇరికిపెంట పంచాయతీ, నంజంపేట పంచాయతీల్లో మరో ఏనుగుల మంద తోటలో కోతకు సిద్ధంగా ఉన్న మల్లికా రకం, బేనిషా మామిడి పండ్లను తిన్నంతా తిని కొమ్మలను ధ్వంసం చేసి, డ్రిప్ పరికరాలను తొక్కి నాశనం చేశాయి. సరస్వతీపురానికి చెందిన చిన్నయ్య టమోటాలను కోత కోసి ఆదివారం మార్కెట్‌కు తరలించేందుకు పొలం వద్దనే టమోటా బాక్సులను నిల్వ చేశాడు. జంట ఏనుగులు ఆమార్గంలో వచ్చి టమోటాను ధ్వంసం చేసి వెళ్లాయి. ఆ సమీపంలోనే వరి పొలంలో సంచరించి నష్ట పరిచాయి. నెల రోజులుగా పులిచెర్ల, సదుం మండలాల వైపు వెళ్లిన ఏనుగులు మళ్లీ మామిడి కోతల సమయంలో మండలంలో ప్రవేశించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో అధికంగా బేనిషా, మల్లిక రకం, నీలం రకం మామిడి కోతలు చేయాల్సి ఉంది. రెడ్డివారిపల్లె, కొత్తూరు, పత్రపల్లె ప్రజలు పొలాల వద్ద అగ్గి మంటలు వేసుకొని జాగరణ చేస్తున్నారు.

అధికారులకు సమాచారం ఇచ్చినా వారు స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. దుర్గంకొండ, బోనమంద, పత్రపల్లె అటవీ ప్రాంతం నుంచి వెదురు అక్రమంగా తరలిపోతున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.



పేటూరు వద్ద మామిడి తోటలో కొమ్మలను విరిచేసిన ఏనుగులు

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత చౌడేశ్వరి

వాల్మీకిపురం, జూన్ 2: ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి వాల్మీకిపురం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన వెంకటేశ్వర్లు, రుక్మిణి దంపతుల కుమార్తె చౌడేశ్వరి(29) కలకడ మండలం కదిరాయ చెరువుకు చెందిన మంజునాథతో 9నెలల క్రితం వివాహం జరిగింది. మంజునాథ నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లెలో సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తూ వాల్మీకిపురం బజారు వీధిలో భార్య చౌడేశ్వరితో కలిసి కాపురముంటున్నాడు. అయితే శనివారం రాత్రి ఏం జరిగిందో తెలియదు కానీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చౌడేశ్వరి ఉరివేసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా వేధింపులతోనే తమ కుమార్తెను కడతేర్చినట్లు మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

నీటికుంటలో పిడుగు పడి చేపలు మృతి


పిడుగుపాటుకు నీటికుంటలో తేలియాడుతున్న చేపలు

నిమ్మనపల్లి, జూన్ 2: మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగారిపల్లి నీటికుంటలో శనివారం రాత్రి పిడుగు పడి టన్ను చేపలు మృతి చెందినట్లు రైతు సుదాకర్‌రావు తెలిపాడు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆరునెలల క్రితం సొంత నిధులతో 20కుంటల భూమిలో నీటి కుంటను ఏర్పాటు చేసి దానిలో కొరమీను చేప పిల్లలను వదిలినట్లు తెలిపాడు. అయితే కొరమీను అమ్ముకొనేందుకు దాదాపు 6నెలల కాలవ్యవధి వుండగా ప్రస్తుతం 5నెలలే కావడంతో ఇక నెల రోజుల్లో చేపలను అమ్ముకొనే సమయంలో పిడుగు పడి దాదాపు 3లక్షల విలువ చేసే టన్ను చేపలు చనిపోయిన నట్లు తెలిపారు. దీంతో దిక్కుతోచని పరిస్థితిలో చేపలను బయటకు తీసి పడవేసినట్లు తెలిపారు.

రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

గాలివీడు, జూన్ 2: రాష్ట్రంలో వ్యవ సాయ సీజన్‌కు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులకు సరిపడా పత్తి, వేరుశనగ, వరి విత్తనాలు, ఎరువులు, జీలుగలు మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం అన్నమ య్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి కోరారు. ఆదివారం గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులం దరికీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముందుగా భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు ఏ ఎరువులు వాడాలో అవగాహన కలిగించాలని కోరారు. కౌలు రైతులకు భూ యజమానులకు సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అవకతవకలుగా ఉన్న భూ సర్వేను రద్దు చేసి రైతుల సమక్షంలో గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు రీ సర్వే చేసి, పాత పాసుపుస్తకాలను అనుసరించి సవరించాలని కోరారు. రైతుల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉన్న భూసర్వే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

సుండుపల్లె, జూన్2: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మానవత ఆధ్వర్యంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 500 మార్కులుపైన వచ్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నూరే ఉజ్మాకు బ్రైట్ ట్యుటోరియల్స్ నిర్వాహకురాలు యాస్మిన్ రూ.3 వేలు ప్రోత్సాహకం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు హరికుమార్, అరీఫుల్లా, రవీంద్రారెడ్డి, ఇస్మాయిల్, నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు ఎగిరిపోయిన పైకప్పు రేకులు

రామాపురం, జూన్ 2: మండలం లోని కుమ్మరపల్లి గ్రామ పంచాయతీ లోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి వీచిన గాలివానకు పలు ఇళ్ల పైకప్పునకు వేసిన రేకులు ఎగిరిపోయాయి. మరో ఇంటిపై విద్యుత్ స్తంభం విరిగి పడింది. కుమ్మరపల్లి పంచాయతీలోని దూదేకులపల్లెలో సుంకేల కృష్ణయ్య, రాజు, బండపల్లె లో షేక్. ముబారక్, మోహన్, లక్ష్మయ్య, జమాల్‌వల్లి ఇళ్లపై ఏర్పాటు చేసిన రేకులు గాలివానకు లేచిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. అదే గ్రామానికి చెందిన షేక్. అబ్దుల్‌సాబ్ ఇంటిపై విద్యుత్ స్తంభం పడడంతో రేకులు విరిగి పడ్డాయి. ఇళ్లల్లో ఉన్న పిల్లలు, పెద్దలు, మహిళలు భయంతో బయటికి పరుగులు తీశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

ఎన్నికల ఫలితాలపై నేతల చర్చలు

చిన్నమండెం, జూన్2: మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీ కుర్వ పల్లెలో కోటకడ వెంకట్రమణ ఇచ్చిన విందు కార్యక్రమానికి రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ రా ష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబులు హాజరయ్యారు. వీరు విందు అనంతరం అక్కడ ఉన్న టీడీపీ కార్యకర్తలు, ఓటర్లతో మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ సరళి పై చర్చించుకున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు

సిద్దవటం, జూన్ 2: రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారం రావాలని, చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల ని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో ఆదివారం కడప జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు కుప్పాల వెం కట సుబ్బయ్య ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రావాలని ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశామని తెలిపారు. అమరావతి కోసం రైతులు భూములు ఇస్తే రైతాంగాన్ని నట్టేట ముంచారని రైతుల గోడు వైసీపీకి శాపంగా మారిందన్నారు. రాష్ట్రంలో మెరుగైన పరిపాలన చంద్రబాబు నాయుడుకే సాధ్యమని, నిజం గెలవాలని ప్రత్యేక పూజలు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతుకు కలిసిరాని కాలం

●ధర ఉన్నా.. దిగుబడిలేక కుదేలవుతున్న టమోటా రైతు ● వేసవి ఎండలతో దెబ్బతింటున్న పంట


ఎండతీవ్రతకు దెబ్బతిన్న టమోటా పంట

రామసముద్రం, జూన్ 2: ఎండనక, వాననక ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న అన్నదాతకు ఏటా కలిసిరాక కష్టాలు తప్పడంలేదు. ముఖ్యంగా వేసవిలో పంటలకు గిట్టుబాటు ధరలు వస్తాయనే ఆశతో టమోటా, కోసు, కొత్తిమీర, బీర, బీన్స్ తదితర కూరగాయల పంటలు ఎక్కువగా సాగుచేస్తున్నారు. అయితే ఈ ఏడాది అధిక ఎండల కారణంగా పంటల దిగుబడులు గణనీయంగా తగ్గాయని రైతులు వాపోతున్నారు. గతేడాది ఏప్రిల్, మే నెలల్లో టమోటా, కొత్తమీర ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది కూడా ధరలు ఉంటాయని ఏప్రిల్, మే నెలల్లో పంటలు చేతికి వచ్చేలా ఫిబ్రవరి, మార్చి నెలల్లో నాటిన టమోటా మొక్కలు తీవ్ర ఎండలకు దెబ్బతిని కాయల సైజు సగానికి తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు టమోటా ధరలు మార్చి, ఏప్రిల్, మే 15వరకు కూడా కిలో రూ.4 నుంచి రూ.5 కంటె మించలేదని, మే 15 తరువాత కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో టమోటా, కొత్తమీర ధరలు కాస్త ఆశాజనకంగా పెరిగాయని రైతులు తెలిపారు. అయితే ఇదే సమయంలో వేసవి తాపానికి పంటల దిగుబడులు సగం తగ్గడంతో ధరలు పెరిగినా ఆదాయం పెరగలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఈ ఏడాది రైతులు అధికంగా టమోటా సాగు చేయడంతో పంట సాగుకు ఉపయోగించే మందులు, ఎరువులు, కొయ్యల రేట్లు, భారీగా పెరగడంతో పంట ఖర్చులు పెరిగినట్లు తెలిపారు. అలాగే కూలీల ఖర్చులు మరింతగా పెరిగాయన్నారు. ఇదిలా ఉంటే కొత్తిమీర ధరలు గత నాలుగు నెలలు గా పూర్తిగా పడిపోవడంతో కొత్తిమీర సాగుచేసిన రైతులు నష్టాలను చవిచూశారు. అయితే మే నెలలో వర్షాలు పడి కొత్తిమీర పంట దెబ్బ తినడంతో ధరలు అమాంతంగా పెరిగినా ఫలితంలేకుండాపోయిందని రైతులంటున్నారు. అలాగే మార్చి, ఏప్రిల్ నెలలో బీన్స్‌కు గిట్టుబాటు ధరలు ఉన్నా ఎండల తీవ్రతకు పంట దిగుబడి తగ్గిపోయి పెట్టిన ఖర్చులు కూడా రావడంలేదని వాపోతున్నారు. ఈ విధమైన ఒడిదు డుకులలో రైతులు పండించే పంటలకు లాటరీ తగిలినట్లు ఎప్పుడు రేట్లు వస్తాయో ఎప్పుడు ఏ పంటలు సాగు చేయాలో తెలియక తికమ క పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండ తీవ్రత పంట దిగుబడి తక్కువ..



గతేడాది మూడెకరాల్లో టమోటా సాగు చేశాను, ధరలు ఆశాజనకంగా ఉండడంతో సుమారుగా రూ.10లక్షలు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఐదు ఎకరాలలో టమోటా పంట సాగు చేశా. అయితే ఎండల ప్రభావంతో దిగుబడి తగ్గి ఏప్రిల్ నెలలో పంట కోతకు రావడంతో గిట్టుబాటు ధరలు లేక నష్టపోయాను.

-రంగప్ప, రైతు తిరుమలరెడ్డిపల్లె, రామసముద్రం

ధరలు నిలకడగా లేదు..



మార్చి, ఏప్రిల్ నెలల్లో మూడెకరాల్లో కొత్తిమీర సాగు చేశాను. అయితే ధరలు లేకపోవడంతో పంటను పూర్తిగా పశువుల మేతకు వదిలేశాను. అయితే మే నెలలో ఒక ఎకరా కొత్తమీర సాగు చేశాను. ధరలు ఆశాజనకంగా ఉండడంతో రూ.4లక్షలు ఆదాయం వచ్చింది. గతంతో పోల్చితే వచ్చిన ఆదాయం అంతంత మాత్రమే.

-రమేష్, రైతు, రామసముద్రం

కంపు భరించలేకున్నారు... అధికారులూ పట్టించుకోండి

●ఉమ్మడికూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా


కదిరిరోడ్డులో మురుగు కాలువను పరిశీలిస్తున్న షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 2: మదనపల్లె పట్టణ నడిబొడ్డున డ్రైనేజీ కాలువలు పగిలిపోయాయి..30 రోజులుగా ప్రజలు కంపు భరించలేకున్నారు..మున్సిపల్ అధికారులూ ఇప్పటికైనా పట్టించుకోండంటూ ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఆదివారం స్థానిక కదిరిరోడ్డులోని శ్రీకృష్ణ కాంప్లెక్స్ ఎదుట తాళ్లవీధిలో డ్రైనేజీ కాలువ మరమ్మతుకు గురై చిన్నపాటి వర్షం వస్తేనే తాళ్లవీధి నీటికుంటలా మారిపోతోంది. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మున్సిల్ సిబ్బంది డ్రైనేజీ కాలువలపై ఉన్న బండలు తొలగించి వదిలేశారే కాని, వాటి మరమ్మతు చేయలేదు. దీంతో నిత్యం వేలాదిమంది తిరిగే ప్రాంతంలో మురుగు కంపు భరించలేక ప్రజలు ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆయన అక్కడి వెళ్లి పరిస్థితి తెలుసుకుని, మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు ఫోన్ చేసి ప్రజల ఇబ్బందులు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఎంసీసీ కోడ్ అమలులో ఉన్నందున తాము ప్రత్యక్షంగా ఎలాంటి పనులు చేపట్టే వీలు లేదని, కనీసం అధికారులైనా స్పందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.

మల్లయ్యకొండకు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, జూన్ 2: మదనపల్లె నుంచి ప్రతి సోమవారం మల్లయ్యకొండకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె-మల్లయ్యకొం డకు రెండు బస్సులు నడుస్తాయని. అవి తంబళ్లపల్లె నుంచి మల్లయ్య కొండకు సాయంత్రం వరకు అక్కడే షటిల్ సర్వీసులుగా తిరిగి సాయం త్రం మదనపల్లె వస్తాయని డీఎం పేర్కొన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆర్టీసీకి ఆదాయం చేకూర్చాలని కోరారు.

పెనుగాలులతో భారీ నష్టం

పెనగలూరు, జూన్ 2 :గాలుల వల్ల మండలంలోని కొన్ని ప్రాంతాల్లో రైతులకు భారీ నష్టం జరిగింది. మామిడి, బొప్పాయి, అరటి, తోటలు కొంత వరకు దెబ్బతిన్నాయి. ఇదిలా వుండగా పెనుగాలులకు బెస్తపల్లె, నల్లపురెడ్డిపల్లె, చక్రంపేట, కడిమివారిపల్లె, ప్రాంతాలలో చెట్లు విరిగి కరెంటు స్తంభాలు పడిపోవడంతో ప్రజలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే విద్యుత్ అధికారులు రంగం లోకి దిగి ఆదివారం సాయంత్రానికల్లా విద్యుత్‌ను పునరుద్ధరించారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు 400 మంది విద్యార్థులు


సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుంటున్న విద్యార్థులు

మదనపల్లె టౌన్, జూన్ 2: పాలిసెట్‌లో ర్యాంకులు పొందిన 400 మంది విద్యార్థులు జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్‌కు వచ్చినట్లు ప్రిన్సిపాల్ ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో పలువురు విద్యార్థులు వారి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మే 27వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు నిర్వహించిన ఏడు రోజుల కౌన్సెలింగ్‌లో 400 మంది విద్యార్థులు సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారన్నారు. మూడో తేది కూడా వెరిఫికేషన్ ఉన్నా..ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144వ సెక్షన్ అమలులో ఉండటం కారణంగా 3వ తేదీ నిర్వహించాల్సిన కౌన్సెలింగ్‌ను ఈనెల 6వ తేదీకి వాయిదా వేశారన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి 6వ తేది కౌన్సెలింగ్ చివరి రోజును సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

మోడల్ స్కూల్లో మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

ములకలచెరువు, జూన్ 2: స్థానిక మోడల్ స్కూల్‌లో 2024- 25 విద్యా సంవత్సరంలో 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 5వతేదీ లోగా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 6వతేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ఎంపిక జరుగుతుందని తెలిపారు. అలాగే కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఈ నెల 1వతేదీ నుంచి ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి మెరిట్ లిస్టులు కళాశాల నోటీసు బోర్డులో ఉంచామని, విద్యార్థులు అవసరమైన సర్టిఫికెట్లతో కళాశాలలో ప్రవేశం పొందవచ్చన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

సంబేపల్లె, జూన్ 2: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయశాఖ అధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జూన్ 3వ తేదీ జనరల్ నాలెడ్జ్, ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులకు జూన్ 7వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాల ద్వారా పిల్లలు తమ మేధాశక్తిని పెంపొందించు కోవచ్చునన్నారు. సమ్మర్ క్యాంపును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొనలేం.. తినలేం..



● భారీగా పెరిగిన కూరగాయల ధరలు

సుండుపల్లె, జూన్ 2: వేసవిలో ఎండల తీవ్రతకు కూరగాయల ధరలు మండిపోతున్నాయి. పప్పులు సహా అన్ని రకాల నిత్యావసర ధరలు పెరిగిపోయాయి. బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. బీపీటీ రకం బియ్య 26 కేజీలు రూ.1500 వరకు పలుకుతోంది. లీటర్ నూనె ప్యాకెట్ ధర రూ.120 వరకు పలుకుతోంది. ధరల నియంత్రణపై అధికారులు దృష్టి సారించక పోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. కూరగాయల దిగుబడులు తగ్గిపోవడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. పచ్చిమిర్చి ధర వింటేనే వినియోగదారులకు ఘాటు తగులుతోంది. బెండకాయలు కొనాలంటే బెంగ పట్టుకుంటోంది. పరిస్థితి ఏమీ కొనలేం, ఏమీ తినలేం అన్న చందంగా తయారైంది. కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఎండల తీవ్రత, నీటి లభ్యత లేక సాగు చేయకపోవడం, ఉత్పత్తి తగ్గిపోవడం, దూర ప్రాంతాల నుంచి సరుకు రావడం తదితర కారణాల వల్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. టమోటా, బెండ, దొండ, వంకాయ, పచ్చిమిర్చి ధరలు అనూహ్యంగా పెరిగాయి. డిమాండుకు తగిన విధంగా సరుకు దిగుమతి కావడం లేదని దుకాణదారులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో అందుబాటులో ఉన్న ధరలు ఇప్పుడు అనూహ్యంగా పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమనే చెప్పాలి.

కొసరు ఊసే లేదు:

కూరగాయలు కొన్నప్పుడు కొద్దిగా కొత్తిమీర, కరివేపాకు అడగడం, ఇవ్వడం పరిపాటి. ప్రస్తుతం కొత్తిమీర చిన్నకట్ట రూ.30, పెద్దది రూ.60కి కొనాల్సి వస్తోంది. కరివేపాకు కావాలంటే రూ.10 చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. అల్లం కేజీ రూ.200, మునక్కాడ ఒకటి రూ.10 నుంచి రూ.15 వరకు పలుకుతోంది. నిమ్మకాయలు అయితే చిన్నకాయ సైతం రెండు రూపాయలు ధర పలుకుతుండటం గమనార్హం.

మాంసం ధరలు సైతం...

కోడి, మేక మాంసం, చేపలు ధరలు సైతం పెరగడంతో ప్రజలు తినడం తగ్గిస్తున్నారు. కేజీ కోడి మాంసం ధర రూ.270 నుంచి రూ.280 వరకు ఉంటే మటన్ ధర రూ.800 వరకు పలుకుతోంది. ఒక్కసారిగా వాటి ధరలకు రెక్కలు రావడంతో కూరగాయలపైనే ఆధారపడుతున్నారు. దీంతో కూరగాయల ధరలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయి. చౌకధరలకు లభించే వారపు సంతల్లో సైతం ధరలు అధికంగానే ఉండటం ఇబ్బందిగా మారుతోంది.

సామాన్యులం కొనలేం



కూరగాయల ధరలు ఇంతగా పెరగడం ఎప్పుడూ చూడలేదు. ధరల్లో పెరుగుదల తప్ప తగ్గడం కనబడటం లేదు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తినాలని సమావేశాల్లో అధికారులు చెబుతున్నారు. గతంలో రూ.500 కేటాయిస్తే నెలలో రెండు వారాలకు సరిపోయేవి. ప్రస్తుతం రూ.వెయ్యి వరకు దాటిపోతోంది. దినసరి కూలీలు, సామాన్యులు కూరగాయలను కొనలేక పోతున్నారు.

- రేవతి, మాచిరెడ్డిగారిపల్లె

ధరలు అదుపు చేయాలి



ధరలు అదుపు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతుల నుంచి కొనుగోలు చేసే ధరలకు వ్యాపారులు విక్రయించే వాటికి వ్యత్యాసం ఉంది. దీన్ని నివారిస్తే రైతులకు, వినియోగదారులకు లాభం చేకూరుతుంది.

- లక్ష్మీదేవి, చెన్నంశెట్టిపల్లె

కనుమలో గంగమ్మ...చల్లంగా చూడమ్మా


దీలూ, బోనాలూ తీసుకువెళుతున్న మహిళలు

మదనపల్లె, జూన్ 2: చల్లంగా చూడమ్మా..గంగమ్మ అంటూ కనుమలో గంగమ్మకు భక్తులు దీలూ, బోనాలూ సమర్పించి కర్పూర హారతులతో వేడుకున్నారు. ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ జింకవెంకటాచలపతి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్వీఆర్ లేఅవుట్, వడ్డిపల్లెకు చెందిన మహిళలు భక్తి శ్రద్ధలతో కాలినడకన వెళ్లి పుంగనూరు రోడ్డులో వెలసిన కనుమలో గంగమ్మకు దీలూ, బోనాలూ సమర్పించారు. వర్షాలూ బాగా కురిసి పంటలు బాగా పండాలని, పట్టణంలో నీటి సమస్య లేకుండా చూడాలని మొక్కుకున్నారు. ఏ విధమైన అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, చిన్న ఆంజినేయులు, సూరి, హేమంత్, పెద్ద ఆంజినేయులు, అరుణమ్మ, రెడ్డమ్మ, దీప, హేమ, రాధమ్మ, విజయమ్మ వార్డు ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, జూన్ 2:మండలంలోని చెర్లోపల్లె సమీపంలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శంచుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు చెల్లించారు. ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి


ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన ధ్వజ స్థంభం

ములకలచెరువు, జూన్ 2: మండలంలోని బురకాయలకోటలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆది వారం కన్నుల పండవగా కమనీయంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామి వారి కల్యాణోత్సవం జరిపించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అలాగే ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, మూల మంత్రంతో హోమాలు, ప్రాకారోత్సవం, మహామంగళ హారతి, వేదపారాయణ కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి బళ్లారి డప్పులు, మేళతాళాల నడుమ గ్రామంలో ఘనంగా ఊరేగించారు. ఆలయం ముందు ధ్వజ స్థంభం ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సర్పయాగం కథతో మహాభారతం ప్రారంభం

నిమ్మనపల్లి, జూన్ 2: మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతి బాలినాయునిపల్లెలో ఆదివారం మహాభారతం సర్పయాగం హరికథతో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పగటి పూట హరికథ రాత్రి నాటకము ఉంటుందని తెలిపారు. అదే విధంగా ప్రతి ఏడాది వేసవిలో మహాభారతాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా 21రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాభారతానికి మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కౌంటింగ్ రోజు గొడవలు సృష్టిస్తే క్రిమినల్ కేసులు

పెద్దమండ్యం, జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ రోజైన ఈనెల 4వ తేదీన గొడవలు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పెద్దమండ్యం ఎస్ఐ చెన్నకేశవ హెచ్చరించారు. మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ములకలచెరువు సీఐ మధు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని రాజకీయపార్టీల నాయకులతో విడివిడిగా గత వారం రోజులుగా సమావేశాలు నిర్వహించారు. ఆదివారం గ్రామాలలో ఆటోలలో పర్యటించి మైకుల ద్వారా పోలీసుల హెచ్చరికలు, సూచనలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పబడిన వారు పోలీసుల చర్యలతో భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ప్రజలకు సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక పోలీసు నిఘా పెట్టినట్టు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఇసాక్, మధుసూదానాచారి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

7న ఊటీకి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

మదనపల్లె అర్బన్ జూన్ 2: మదనపల్లె ఆర్టీసీ వన్ డిపో నుంచి ఈ నెల 7న ఊటీకి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. వేసవిసెలవులో ప్రయాణిలు విహరయాత్ర చేయడానికి సూపర్‌లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 7వ తేదీ రాత్రి 9 గంటలకు మదనపల్లెలో బయలుదేరి 8వ తేదీ ఉదయం ఊటీకి చేరుకుని ఆ రోజు ఊటీలో ఉండి 9 వతేదీ ఉదయం ఊటీ నుంచి బయలుదేరి మైసూరుకు వెళ్లి అక్కడ పలు ప్రదేశాలను సందర్శించిన అనంతరం అక్కడ నుంచి రాత్రికి బయలుదేరి 10వ తేదీన ఉదయం మదనపల్లెకు చేరుతుందని డీఎం తెలిపారు. రానుపోను ఒక్కరికి బస్సు టికెటు రూ.2800 నిర్ణయించామని, యాత్రికులు, ప్రయాణికులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు. ప్రయాణికులు ఆర్టీసీ ప్రయాణం సురక్షితం అన్నారు. మరెన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్లకు 7382875034, 7382876658, 9441646104, 9440249483కు సంప్రదించాలని కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో శిక్షణ పొందిన పిల్లలు, అతిథులు

తంబళ్లపల్లె, జూన్ 2: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎస్‌డీవో) గౌస్‌బాషా పేర్కొన్నారు. స్థానిక పాత కళాశాల మైదానంలో జిల్లా స్పోర్ట్స్ ఆధ్వర్యంలో శిక్షకుడు యూసఫ్ గత నెల రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎస్ఐ శివకుమార్, మెడికల్ ఆఫీసర్ వెంకట్రామయ్య, జిల్లా పీడీల ప్రెసిడెంట్ రమేష్, సీనియర్ పీడీలు భద్రయ్య, ఖాదర్‌బాషా, ఆర్చరీ కేలో ఇండియా కోచ్ రవీంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..క్రీడలతో మానసిక ఒత్తిడిని జయించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. యువత సామాజిక మాధ్యమాల వినియోగం తగ్గించి చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చాటిన పిల్లలకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, స్పాన్సర్లు, స్థానిక సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు, పిల్లల తల్లితండ్రులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.